




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States

సంపుటి : 24 | సంచిక : 53 | ది. 24-04-2025 | విజయవాడ | గురువారం | పేజీలు : 8 | వెల : రూ. 1/-


## మే 12 నుంచి ఏపీ ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు


**అమరావతి,ఏప్రిల్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి)**ఏపీలో మే 12 నుంచి ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహించబోతున్నట్లు ఏపీ ఇంటర్ బోర్డు ఇటీవల ప్రకటించింది. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మే 12 నుంచి మే 20 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. ప్రాక్టికల్ పరీక్షలు మే 28 నుంచి జూన్ 1 వరకు జరగనున్నాయి. ఎథిక్స్ అండ్ హ్యూమన్ వ్యాల్యూస్ పరీక్ష జూన్ 4న, పర్యావరణ విద్య జూన్ 6న నిర్వహించనున్నట్లు అధికారులు ఇది వరకే తెలిపారు.

# ఫహల్గామ్ ఉగ్రదాడిలో ఇద్దరు తెలుగు వ్యక్తుల మృతి

■ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ఏపీ సీఎం చంద్రబాబు ■ ఉగ్రవాద చర్యలు సమాజానికి మాయని మచ్చ వంటివని వెల్లడి ■ ఉగ్రవాదం ద్వారా ఇప్పటివరకు ఎలాంటి లక్ష్యాలు నెరవేరలేదని స్పష్టీకరణ

**అమరావతి, ఏప్రిల్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి)** జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్ వద్ద జరిగిన ఉగ్రవాద దాడిలో చెందిన ఇద్దరు తెలుగు వ్యక్తులు మృతి చెందడం పట్ల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన జె.ఎస్. చంద్రమౌళి, మధుసూదన్ కుటుంబాలకు ఆయన ప్రగాఢ సంతాపం తెలిపారు. ఈ విషాద ఘటనపై స్పందించిన ముఖ్యమంత్రి, ఉగ్రవాదుల దాడిలో తెలుగు సమాజానికి చెందిన ఇద్దరు వ్యక్తులు మరణించడం అత్యంత బాధాకరమని అన్నారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కష్ట సమయంలో వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని కోరుకుంటున్నట్లు తెలిపారు. ఈ తీరని లోటును తట్టుకునే శక్తిని ఆ కుటుంబాలకు ఇవ్వాలని ఆకాంక్షించారు. ఉగ్రవాద చర్యలు సమాజానికి మాయని మచ్చ వంటివని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. చరిత్రను పరిశీలిస్తే, ఉగ్రవాదం, హింస ద్వారా ఏ లక్ష్యాలు నెరవేరలేదని స్పష్టమవుతుందని అన్నారు. ఇలాంటి దాడులకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. దేశ సార్వభౌమత్వాన్ని కాపాడటంలో, ఉగ్రవాదంపై పోరాటంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంపూర్ణ మద్దతుగా నిలుస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని ఎదుర్కోవడంలో కేంద్రం తీసుకుంటున్న దృఢమైన, నిర్ణయాత్మక చర్యలకు తమ సంఘీభావం ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు. ఈ ఘోరానికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అన్నారు

**ఘటన గురించి విని షాకయ్యా : మాజీ సీఎం జగన్ ట్వీట్**జమ్మూ కాశ్మీర్ లో పహల్గాంలో టూరిస్టుల పై జరిగిన ఉగ్రదాడి ఘటనను ఏపీ మాజీ సీఎం, వైసీపీ నేత వైఎస్ జగన్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం జమ్మూకాశ్మీర్ పహల్గామ్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రమూకలు దాడి చేసిన ఘటన దేశాన్నే కుదిపేసింది. ఈ ఉగ్రదాడిలో 28 మంది మృతి చెందారు. అక్కడికి వెళ్లిన టూరిస్టులను మతం గురించి అడిగి మరీ ముష్కరులు కాల్చి చంపారు. ఈ అమానుష ఘటన పై మాజీ సీఎం జగన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ క్రమంలో పహల్గామ్ ఉగ్రదాడి ఘటన గురించి విని షాకయ్యానని తెలిపారు. ఈ పిరికిపందల హింసాత్మక చర్యలను వైఎస్ జగన్ తీవ్రంగా ఖండించారు. ఉగ్రదాడి ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. పర్యాటకులను అమానవీయంగా చంపేశారని అన్నారు. ఏపీకి చెందిన ఇద్దరు వ్యక్తులు ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోవడం మనసును కలచివేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలవాలని మాజీ సీఎం జగన్ ట్విట్టర్ వేదికగా కోరారు.



**ఉగ్రవాద దాడిలో మృతులకు జనసేన ఆధ్వర్యంలో మూడు రోజులపాటు సంతాప దినాలు**

జనసేన కార్యాలయాలపై పార్టీ జెండా అవనతం జమ్ము కాశ్మీర్ లోని బైసరన్ ప్రాంతంలో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి చేసి 28 మందిని హతమార్చడాన్ని జనసేన పార్టీ తీవ్రంగా ఖండిస్తోంది. పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్ ఈ దుశ్చర్యను ఖండించి, మృతులకు సంతాపం తెలియచేశారు. జనసేన పార్టీ పక్షాన మృతులకు సంతాపం తెలియచేస్తూ మూడు రోజులపాటు సంతాప కార్యక్రమాలు నిర్వహించాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు. బుధవారం ఉదయం అన్ని పార్టీ కార్యాలయాలపై పార్టీ జెండాను అవనతం చేస్తూ సగం వరకూ దించి ఉంచాలని స్పష్టం చేశారు. సాయంత్రం కూడళ్లలో కొవ్వొత్తులు వెలిగించాలని, శుక్రవారం సాయంత్రం రాష్ట్రవ్యాప్తంగా మానవ హారాలు నిర్వహించి ఉగ్రవాద దాడిని ఖండించాలని తెలియచేశారు.

# టెన్త్ లోనూ 'ఎంజేపీ'దే హవా

■ 95 శాతం ఉత్తీర్ణతతో టాప్ లేపిన బీసీ విద్యార్థులు ■ 29 స్కూళ్లో 100 శాతం ఫలితాలు నమోదు ■ ప్రభుత్వ పరిధిలోని పాఠశాలల్లో ఎంజేపీదే పైచేయి ■ రాష్ట్ర స్థాయి పర్సంటేజీ కంటే అధికం ■ ఇటీవల విడుదలైన ఇంటర్ ఫలితాల్లోనూ ఇదే జోరు ■ బీసీ విద్యార్థుల రిజల్ట్ పై మంత్రి సవిత హర్షం ■ ఈ విజయం ముమ్మాటికీ సీఎం చంద్రబాబుదేనని వెల్లడి

**అమరావతి, ఏప్రిల్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి)** పదో తరగతి పరీక్షల్లోనూ మహాత్మా జ్యోతిరావు పూలే(ఎంజేపీ) బీసీ గురుకుల విద్యార్థులు టాప్ లేపారు. బుధవారం విడుదలైన టెన్త్ పరీక్షల్లో ఎంజేపీ బీసీ స్కూల్ విద్యార్థులు 95 శాతం మేర ఉత్తీర్ణతీ సాధించారు. ఇటీవల విడుదలైన ఇంటర్ పరీక్షల్లోనూ ఎంజేపీ విద్యార్థులు ప్రభంజనం సృష్టించిన విషయం విధితమే. ఎంజేపీ స్కూల్ విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తంచేశారు. రాష్ట్రస్థాయి ఉత్తీర్ణత కంటే అధికంగా ఎంజేపీ విద్యార్థుల ఉత్తీర్ణత శాతం అధికంగా ఉండడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షల ఫలితాలను రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా విడుదల చేశారు. రాష్ట్ర స్థాయి ఫలితాల్లో 81.14 శాతం మేర ఉత్తీర్ణత శాతం నమోదైంది. ఈ ఫలితాల్లో బీసీ వెల్ఫేర్ కు చెందిన ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులు 95 శాతం ఉత్తీర్ణతతో సత్తా చాటారు. రాష్ట్ర వ్యాప్తంగా 102 ఎంజేపీ స్కూళ్లకు చెందిన 5,788 మంది విద్యార్థులు టెన్త్ పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 95 శాతం మంది పాసయ్యారు.

**29 స్కూళ్లో వంద శాతం ఫలితాలు** ఈ ఏడాది మార్చిలో జరిగిన పదో తరగతి పరీక్షలకు ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ కు చెందిన 11,819 పాఠశాలలకు చెందిన 6,14,459 మంది విద్యార్థులు హాజరయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా 102 ఎంజేపీ స్కూళ్లకు చెందిన 5,788 మంది విద్యార్థులకు తమ అదృష్టాన్ని పరీక్షించుకున్నారు. వారిలో 95 శాతం మంది పదో తరగతి పరీక్షల్లో పాసైయ్యారు. 29 ఎంజేపీ స్కూళ్లలో వంద శాతం మేర ఉత్తీర్ణత సాధించడం విశేషం. అదే సమయంలో ఎంజేపీ స్కూళ్లో జీరో ఉత్తీర్ణత శాతం నమోదుకాకపోవడం మరో విశేషం.

**రాష్ట్ర సగటు ఫలితాలు కంటే అధికం** ఇంటర్ ఫలితాలు మాదిరిగానే రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేసిన టెన్త్ ఫలితాల్లో ఎంజేపీ స్కూళ్లు అత్యుత్తమ ఫలితాలు సాధించాయి. రాష్ట్ర స్థాయి సగటు ఫలితాలు పరిశీలిస్తే...81.14 శాతంగా నమోదైంది. ఎంజేపీ స్కూళ్ల విద్యార్థులు 95 శాతం మేర ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ ఫలితాల్లోనూ ఎంజేపీ కళాశాలలు అత్యుత్తమ ఫలితాలు సాధించిన విషయం విధితమే. ఇంటర్ రాష్ట్ర స్థాయి సగటు ఫలితాలు పరిశీలిస్తే... ఫస్ట్ ఇంటర్ లో 70 శాతం ఫలితాలు రాగా, ఎంజేపీ కళాశాలు 92.40 శాతం మేర ఫలితాలు సాధించాయి. ఇంటర్ సెకండియర్ లో రాష్ట్ర వ్యాప్తంగా 83 శాతం మేర ఫలితాలు రాగా, ఎంజేపీ కళాశాల విద్యార్థులు 98 శాతం మేర ఉత్తీర్ణత సాధించడం విశేషం.

**ఎంజేపీ బీసీ విద్యార్థులదే పైచేయి...**రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ రెసిడెన్షియల్ స్కూళ్లు, కేజీబీవీ, మోడల్ స్కూళ్లు, ప్రభుత్వ పాఠశాలల ఫలితాలు పరిశీలిస్తే...



ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లతో సమానంగా ఎంజేపీ బీసీ స్కూళు అత్యుత్తమ ఫలితాలు సాధించాయి. ఏపీ మోడల్ స్కూళ్లు 84 శాతం, సోషల్ వెల్ఫేర్ స్కూళ్లు 89.5 శాతం, ట్రైబల్ వెల్ఫేర్ 67.6 శాతం, కేజీబీవీ పాఠశాలలు 83 శాతం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు 71.9 శాతం, ఎయిడెడ్ స్కూళు 73.3 శాతం, మున్సిపల్ పాఠశాలలు 69.3 శాతం, ప్రభుత్వ పాఠశాలలు 62.7 శాతం మాత్రమే ఫలితాలు సాధించాయి. ఏపీ రెసిడెన్షియల్ స్కూళ్లు 95 శాతం మేర ఫలితాలు సాధించాయి. వాటితో సమానంగా ఎంజేపీ స్కూళ్లు కూడా 95 శాతం మేర ఫలితాలు సాధించడం విశేషం.

**ఈ విజయం సీఎం చంద్రబాబుదే... : మంత్రి సవిత** టెన్త్ ఫలితాల్లో ఎంజేపీ బీసీ స్కూళ్లు అత్యుత్తమ ఫలితాలు సాధించడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత హర్షం వ్యక్తం చేశారు. కార్పొరేట్ సంస్థలకు ధీటుగా ఎంజేపీ బీసీ స్కూళ్లు ఫలితాలు సాధించాయన్నారు. 29 స్కూళ్లో వంద శాతం పలితాలు రావడంపై ఆమె ఆనందం వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ విద్యార్థుల విద్యకు ఎంతో ప్రాధాన్యమిస్తోందని, సీఎం చంద్రబాబు ఆశయాలు నెరవేర్చేలా టెన్త్ లో ఫలితాలు రాబట్టినందుకు ఆమె విద్యార్థులను అభినందించారు. అత్యుత్తమ ఫలితాలు సాధించడంలో విశేష కృషి చేసిన ఎంజేపీ బీసీ ఉపాధ్యాయులకు, ఉపాధ్యాయేతర సిబ్బందికి కూడా మంత్రి సవిత అభినందనలు తెలిపారు. అధికారంలోకి రాగానే డైట్ బిల్లులు, కాస్మోటిక్ ఛార్జీల బకాయిల చెల్లించామన్నారు. హాస్టళ్ల మరమ్మతులు, మౌలిక వసతుల కల్పనకు నిధుల మంజూరు చేశామన్నారు. ఎస్ఆర్ శంకరన్ రిసోర్స్ సెంటర్లతో పాటు విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. హాస్టళ్లకు నిరంతరం విద్యుత్ సరఫరా అయ్యేలా ఇన్వర్టర్లు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులకు అన్ని సబ్జెక్టుల్లోనూ పట్టు సాధించేలా ఉపాధ్యాయులతో నిరంతర పర్యవేక్షణతో పాటు ప్రత్యేక తరగతులు నిర్వహించామన్నారు. ఈ విజయం ముమ్మాటికీ సీఎం చంద్రబాబుదేనని మంత్రి సవిత స్పష్టంచేశారు.

# ప్రశాంతంగా ముగిసిన హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోలింగ్.

**రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి**

**78.57 శాతం పోలింగ్**

**హైదరాబాద్, ఏప్రిల్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి)**హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానానికి బుధవారం జరిగిన పోలింగ్ ప్రశాంతంగా ముగిసిందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనురాగ్ జయంతి తెలిపారు. ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ నిర్వహించగా, మధ్యాహ్నం 2 గంటల వరకే 78.57 శాతం ఓట్లు పోల్ అయ్యాయని తెలిపారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో మొత్తం ఓటర్లు 112 మందిలో 88మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు.హౌమొత్తం 112 ఓటర్లలో ఎక్స్ అఫిషియో మెంబర్ 31 కాగా, అందులో 22 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. 81 మంది కార్పొరేటర్ల లో 66 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఉదయం 8 గంటల నుండి 10 గంటల వరకు 37.51 శాతం పోలింగ్ నమోదు కాగా, మధ్యాహ్నం 12 గంటల వరకు 77.68 శాతం, మధ్యాహ్నం 2 గంటల వరకు 78.57 శాతం పోలింగ్ నమోదు అయ్యింది సాయంత్రం 4 గంటల వరకు 78.57 శాతం నమోదు అయ్యిందిఎన్నికల పరిశీలకులు సురేంద్ర మోహన్ రిటర్నింగ్ అధికారితో కలిసి పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ సరళిని పరిశీలించారు. పోలింగ్ ముగిసిన అనంతరం బ్యాలెట్ బాక్సులను రిసెప్షన్ సెంటర్ కు బందోబస్తుతో తీసుకువచ్చిన పిదప పరిశీలన చేసిన తర్వాత స్ట్రాంగ్ రూం లో భద్రపరిచారు. స్ట్రాంగ్ రూంహౌవద్ద గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసారు.హౌ ఈ నెల 25న ఉదయం 8గంటలకు ఓట్ల లెక్కింపు జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని పన్వర్ హాల

# ఆ జిల్లాలకు రెడ్ అలర్ట్

**హైదరాబాద్: ఏప్రిల్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి)**తెలంగాణలో భారీ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. ఉత్తర తెలంగాణ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. ఆదిలాబాద్, కొమరం భీమ్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాలకు రెడ్అలర్ట్ ప్రకటించింది. రెడ్ అలర్ట్ ఉన్న జిల్లాల్లో 45 డిగ్రీలకు పైగా టెంపరేచర్స్ నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. రెడ్ అలర్ట్ జారీ చేసిన తొమ్మిది జిల్లాలు మినహా మిగిలిన జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాత్రి కనిష్ఠ ఉష్ణోగ్రతలు పెరగనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వడగాల్పుల ప్రభావం ఉందని.. ఆదిలాబాద్, కొమరం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, మంచిర్యాల, కామారెడ్డి, మెదక్ మహబూబ్‌నగర్ జిల్లాలకు వడ గాల్పుల హెచ్చరికలను వాతావరణ శాఖ జారీ చేసింది.

# 12,800 కోట్లతో రెండు అణు రియాక్టర్లు నిర్మించనున్న ఎంఈఐఎల్



**హైదరాబాద్, ఏప్రిల్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి)**కర్ణాటక రాష్ట్రంలోని కైగా వద్ద 700 మెగావాట్స్ ఎలక్ట్రిక్ సామర్థ్యం కలిగిన రెండు అణు రియాక్టర్ యూనిట్ల నిర్మాణానికి సంబంధించి పర్చేజ్ ఆర్డర్ ను మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) బుధవారం అందుకుంది. ముంబైలో బుధవారం జరిగిన ఒక కార్యక్రమంలో న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్పీసీఐఎల్) సీనియర్ అధికారుల నుండి పర్చేజ్ ఆర్డర్ ను ఎంఈఐఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) సి. హెచ్. సుబ్బయ్య అందుకున్నారు. కైగా యూనిట్లు 5, 6 అణు రియాక్టర్లను ఎన్పీసీఐఎల్ కోసం ఎంఈఐఎల్ నిర్మించనుంది. ఇంజనీరింగ్, ప్రొక్యూర్మెంట్, కన్స్ట్రక్షన్ (ఈపీసీ) విధానంలో ఎంఈఐఎల్ ఈ అణు రియాక్టర్ల నిర్మాణాన్ని చేపట్టనుంది. ఇప్పటి వరకు ఎన్పీసీఐఎల్ ఏకమొత్తంగా ఇచ్చిన అతిపెద్ద ఆర్డర్ ఇదే. బీహెచ్ఈఎల్, ఎల్ అండ్ టీ వంటి ఇతర ప్రముఖ బిడ్డర్లతో పోటీ పడి ఈ కాంట్రాక్టును ఎంఈఐఎల్ దక్కించుకోవడం విశేషం. ఈ ప్రతిష్టాత్మక ఈపీసీ కాంట్రాక్ట్ ఎంఈఐఎల్కు లభించడం, భారతదేశ ఇంధన మౌలిక సదుపాయాల అభివృద్ధికి కంపెనీ చేస్తున్న కృషిని తెలియజేస్తోంది.మొట్టమొదటిసారిగా ఈ టెండర్ ప్రక్రియలో క్వాలిటీ-కమ్-కాస్ట్-బెస్ట్ సెలెక్షన్ (క్యూసీబీఎస్) విధానాన్ని ఎన్పీసీఐఎల్ అవలంబించింది. టెండర్ కేటాయింపులో సాంకేతిక నైపుణ్యం, ఖర్చు సామర్థ్యం రెండింటినీ సమతుల్యంగా అంచనా వేసింది. పర్చేజ్ ఆర్డర్ ను అందుకున్న సందర్భంగా ఎంఈఐఎల్ డైరెక్టర్ (ప్రాజెక్ట్స్) సుబ్బయ్య మాట్లాడుతూ తమ సంస్థ అత్యుత్తమ సాంకేతిక సామర్థ్యానికి, పోటీ తత్వానికి ఈ కాంట్రాక్టు సాధించటం ఓ నిదర్శనం అన్నారు. కైగా అణు రియాక్టర్ల నిర్మాణ ప్రాజెక్ట్ దేశ ఇంధన భవిష్యత్తుకు కీలకమైన అణు ఇంధన రంగంలోకి తమ సంస్థ వ్యూహాత్మక ప్రవేశాన్ని సూచిస్తుందని, ఎంఈఐఎల్ కు ఇంజినీరింగ్ నైపుణ్యం, ఆవిష్కరణల పట్ల ఉన్న నిబద్ధతను ఇది ప్రతిబింబిస్తుందని అన్నారు. తాము అత్యున్నత ప్రమాణాలు, భద్రత, విశ్వసనీయతకు కట్టుబడి ఉంటూనే, ప్రాజెక్టు నిర్ణీత సమయంలో పూర్తి చేస్తామన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. దేశ, విదేశాలలో పెద్ద ఎత్తున ఈపీసీ ప్రాజెక్టను విజయవంతంగా పూర్తి చేసిన బలమైన ట్రాక్ రికార్డ్తో, అణు శక్తి రంగంలో మన దేశ స్వావలంబనను పెంపొందించడంలో కీలక పాత్ర పోషించడానికి ఎంఈఐఎల్ సిద్ధంగా ఉందని సుబ్బయ్య తెలిపారు.

# చేనేత, జౌళి శాఖ (పరిశ్రమలు, వాణిజ్యం) ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన ఆర్.పి. సిసోడియా

విజయవాడ, **ఏప్రిల్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి)**సీనియర్ ఐఏఎస్ అధికారి ఆర్.పి. సిసోడియా రాష్ట్ర సచివాలయంలో చేనేత, జౌళి శాఖ (పరిశ్రమలు మరియు వాణిజ్య శాఖ) ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విశాల దృష్టి, పరిపూర్ణ పరిపాలనా అనుభవంతో సిసోడియా నేతృత్వంలో శాఖ అభివృద్ధి దిశగా నడిచే అవకాశం ఉందని నేత కార్మికులు ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన బాధ్యతలు చేపట్టే ముందు సిసోడియా ఛాంబర్ లో సంప్రదాయ పూజాదికాలు నిర్వహించారు.ఈ సందర్భంగా చేనేత, జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి శాఖకు సంబంధించిన ప్రాధాన్య విషయాలు, అమలులో ఉన్న పథకాలు, భవిష్యత్తు కార్యాచరణల పై సిసోడియాకు సమగ్ర వివరాలు అందించారు. చర్చల సందర్భంగా చేతివృత్తుల అభివృద్ధి, మౌలిక సదుపాయాల ఆధునికీకరణ, జాతీయ-అంతర్జాతీయ విపణుల్లో చేనేత వస్త్రాలకు ప్రాధాన్యం కల్పించడం వంటి కీలక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి సీఈఓ వీఆర్ విజయరాఘవ నాయక్, చేనేత, జౌళి శాఖ అదనపు డైరెక్టర్లు మురళీకృష్ణ, శ్రీకాంత్ ప్రభాకర్, సంయుక్త డైరెక్టర్లు కన్న బాబు, రాజారావు, ఆప్కో జనరల్ మేనేజర్ నాగేశ్వరరావు, అకౌంట్స్ ఆఫీసర్ పార్వతి



పాల్గొన్నారు. ఈ సమావేశం ద్వారా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా నేతృత్వంలో చేనేత జౌళి శాఖ మరింత చురుకుగా ప్రభుత్వ లక్ష్యాల సాధనకు సన్నద్ధమైంది.

# పర్యాటకులపై కాల్పులు అత్యంత హేయమైన చర్య.

## బాధిత కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపిన రాష్ట్ర మంత్రి పార్థసారధి..

**ఏలూరు/నూజివీడు,ఏప్రిల్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి)**: జమ్మూ కాశ్మీర్‌లోని బైసరన్, పహల్గామ్, అనంత్‌నాగ్‌లలో అమాయక పర్యాటకులు, స్థానికులపై మంగళవారం జరిగిన ఉగ్రదాడిని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి తీవ్రంగా ఖండించారు. దీనిని హేయమైన చర్యగా ఆయన పేర్కొన్నారు. 26 మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్న, అనేక మందిని గాయపరిచిన సంఘటన అనాగరిక చర్య అన్నారు.

# బంగారయ్య కొట్టు సెంటర్ వద్ద డివైడర్ మధ్య కట్ చేసి నడకదారి ఏర్పాటు


**కటింగ్ పనులను పరిశీలించిన 48 వ డివిజన్ టిడిపి అధ్యక్షులు పేరాబత్తుల రమణ**



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 23: (వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోనిస్థానిక 48వ డివిజన్ బంగారయ్య కొట్టు సెంటర్ వద్ద మెయిన్ రోడ్డుపై మధ్యలో ఉన్న డివైడర్ ను ప్రజల రాకపోకలకు అనువుగా బుధవారం కార్పొరేషన్ అధికారులు కటింగ్ చేయించారు. డివైడర్ కటింగ్ పనులను 48వ డివిజన్ తెలుగుదేశం అధ్యక్షులు పేరాబత్తుల రమణ , తెలుగుదేశం నాయకులు సారిపల్లి రాధాకృష్ణ తదితరులు పరిశీలించారు. ఈ సందర్భంగా పేరాబత్తుల రమణ మాట్లాడుతూ బ్రహ్మంగారి మఠం, బంగారయ్య కొట్టు సెంటర్ కొండ ప్రాంత ప్రజలు రోడ్డు దాటేందుకు వీలుగా ఈ ప్రాంతంలో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ ను మూడు అడుగుల మేర మెట్టుతో కూడిన డివైడర్ కటింగును స్థానిక ప్రజలు కోరుతున్నారని గతంలో తెలుగుదేశం రాష్ట్ర నాయకులు ఎంఎస్. బేగ్ దృష్టికి తాము తీసుకెళ్లడం జరిగిందనీ అన్నారు. దీంతో గతంలో బేగ్ ఈ ప్రాంతాన్ని పరిశీలించి డివైడర్ మధ్యలో నడకదారి అవసరమని కార్పొరేషన్ అధికారులకు తెలియజేసినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో నేడు ఈ డివైడర్ మధ్యలో నడకదారి ఏర్పాటు చేయడం వలన రోడ్డుపై అవతల వైపున ఉన్న బస్ స్టాప్ నకు ప్రజల రాకపోకలకు దారి సౌకర్యం ఏర్పాటయిందని హర్షం వ్యక్తం చేశారు. తెలుగుదేశం రాష్ట్ర నాయకులు బేగ్ నకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ ఏఈ శ్రీనివాసరావు, టిడిపి నాయకులు సారిపల్లి రాధాకృష్ణ, 48వ డివిజన్ టిడిపి నాయకులు ఉప్పాడి రాము, ఎస్ కే. నాగూర్, పఠాన్ అక్బర్, పొన్నాడ రాము, సలీం, ముచ్చిపల్లి శ్రీను, వి. చిన్నా, రాయన రాజా, పేరాబత్తుల వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజారోగ్యమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యం

**ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్**



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని ఎన్టీఆర్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ అన్నారు .ఎమ్మెల్యే సుజనా చౌదరి సౌజన్యంతో మంజూరు చేసిన ఎల్ఓసి (లెటర్ ఆఫ్ క్రెడిట్) పత్రాలను బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ మరియు కూటమి నేతలతో కలిసి బుధవారం భవానిపురం లోని ఎన్డీఏ కార్యాలయంలో అందజేశారు. 50 వ డివిజన్ మహంతిపురం ప్రాంతానికి చెందిన ఎం రామారావు ప్రేగు సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్యం సాయం కోసం దరఖాస్తు చేసుకోగా రూ 3 లక్షల 40 వేల ఎల్ఓసి పత్రాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. 56 వ డివిజన్ కు చెందిన కే గంగా భవాని నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతూ వైద్యం సాయం కోసం దరఖాస్తు చేసుకోగా రూ 5 లక్షల 60, వేల ఎల్ఓసి పత్రాన్ని అడ్డూరి శ్రీరామ్ కూటమినేతలతో కలిసి వారి కుటుంబ సభ్యులకు అందించారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. త్వరితగతిన ఎల్ఓసి మంజూరుకు కృషి చేసిన ఎమ్మెల్యే సుజనా చౌదరికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు కార్యక్రమంలో కూటమి నేతలు కొప్పుల గంగాధర్, తమ్మిన లీలా కరుణాకర్, నున్నా కృష్ణ, వెంపలి గౌరీ శంకర్, దాడి మురళీకృష్ణ, వై విశ్వేశ్వరరావు, పిళ్ళ శ్రీనివాసరావు , గడ్డిపాటి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

# కొత్త పేట పోలీసు స్టేషన్ పరిదిలోని వై.ఎస్.ఆర్.కాలనీలో కార్డన్ అండ్ సెర్చ్.

**అడుగడుగునా జల్లెడ పట్టిన కొత్తపేట పోలీసులు**





**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలోని జక్కంపూడి కాలనీని వందలాది మంది పోలీసులు అష్ట దిగ్బంధనం చేశారు.దాంతో నేరస్తుల గుండెల్లో రైళు పరుగెత్తాయి.ఎన్.టి.ఆర్.జిల్లాలో శాంతి భద్రతలు పరిరక్షణ చర్యలలో భాగంగా, సంఘ వ్యతిరేక శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులు, సామాన్య ప్రజానీకాన్ని ఇబ్బందులకు గురిచేసే వారిని గుర్తించే దిశగా ప్రజలకు మేమున్నామనే భరోసా ఇచ్చేందుకు నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు ఇన్ చార్జ్ డి.సి.పి. గుణ్ణం రామకృష్ణ , పశ్చిమ ఏ.సి.పి. కె.దుర్గారావు , పశ్చిమ జోన్ ఇన్స్పెక్టర్లు చిన్న కొండల రావు , గురుప్రకాష్ , చంద్ర శేఖర్ , ఉమా మహేశ్వర రావు, కృష్ణ మోహన్ , లక్ష్మి నారాయణ వారి సిబ్బందితో మొత్తం 103 మంది అధికారులు మరియు సిబ్బందితో కలిసి ఎన్.టి.ఆర్.జిల్లా పోలీస్ కమీషనరేట్ లోని పశ్చిమ డివిజన్, టూ టౌన్ పోలీసు స్టేషన్ పరిదిలోని వై.ఎస్.ఆర్.కాలనీ పరిసర ప్రాంతాలలో ఈ రోజు తెల్లవారుజము 5.గంటల నుండి 8 గంటల కార్డన్ %డ% సెర్చ్ నిర్వహించారు.ఈ తనిఖీలలో 350 వాహనాలను తనిఖీ చేయగా సరైన పత్రాలు లేని 50 వాహనాలను స్వాధీనం చేసుకొన్నారు. సుమారు 640 ఫ్లాట్ లను తనిఖీ చేసి ఐరీస్ వాహనం ద్వారా 128 మంది తనిఖీ చేసి 5 గురుఅనుమానితులను అదుపులోనికి తీసుకొన్నారు.ఈ సందర్భంగా ఏ.డి.సి.పి. శ్రీ గుణ్ణం రామకృష్ణ మాట్లాడుతూ.... నగర పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతాయని గుర్తించబడిన పరిసర ప్రాంతాలలో అణువణువు, క్షుణ్ణంగా సోదాలు చేయడం జరుగుతుందని, గంజాయి, ఇతర మత్తు పధార్ధాల విక్రయాలు మరియు వినియోగంపై, అనుమానం ఉన్న వ్యక్తులపై ఆరా తీయడం జరిగిందని, శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తులపై పూర్తి నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే రాత్రి సమయాలలో చిన్న చిన్న సంఘటనలు పెద్ద సంఘటనలుగా ప్రజల్లో వ్యాప్తి చెందుతుంది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండటానికి ప్రతి రోజూ అన్నీ ముఖ్య ప్రదేశాలలో కార్డన్ సెర్చ్, ఆకస్మిక తనిఖీలు, వాహన తనిఖీలు, డ్రంక్ %డ% డ్రైవ్ కార్యక్రమాలు నిరంతరం నిర్వహించడం జరుగ్తుందని ఆయన తెలియజేశారు. జిల్లా వ్యాప్తంగా ఇటువంటి ఘర్షణలకు ఆస్కారం లేకుండా, అసత్య ప్రచారాలు నియంత్రించేలా పోలీసులు చర్యలు తీసుకోవడం జరుగుతుంది. ఇకనుంచి తరచుగా కార్డరన్ సెర్చ్ నిర్వహించడంతోపాటు అన్ని ప్రాంతాల్లో తనిఖీలు డ్రంక్ అండ్ డ్రైవ్ జరుగుతుంది. నేరాలు, ఘర్షణలు నియంత్రణకు పూర్తిస్థాయిలో అవసరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## టిడిపి పార్టీ సభ్యత్వం కార్డులు అందజేసిన టిడిపి నాయకులు.




**కైకలూరు ఏప్రిల్ 23 (వార్తా ప్రభ)** ఏలూరు జిల్లా,కైకలూరు నియోజకవర్గం,కైకలూరు మండలం,కైకలూరు లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు ఆదేశాలతో 126 వ బూత్ లో ఇంటింటికీ వెళ్లి తెలుగుదేశం పార్టీ సభ్యత్వ కార్డులను కార్యకర్తలకు పంపిణీ చేసిన రాష్ట్ర తెలుగుయువత కార్యనిర్వహక కార్యదర్శి పూల రామచంద్రరావు (రాజీ),తెలుగుదేశం పార్టీ నాయకులు మరియు బూత్ కన్వీనర్ వీరాబత్తిన సుధ, మైనారిటీ నాయకులు రసూల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ లో సత్తా చాటిన గురుకుల విద్యార్థులు






**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)** సుజాతనగర్. ఇంటర్ లో సత్తా చాటిన గురుకుల విద్యార్థులుమండలం గరీబ్ పేట, గ్రామానికి చెందిన తుంపురు నాగేశ్వరరావు కుమార్తె తుంపురు శ్రావణి దానవాయిగూడెం గురుకుల కళాశాల లో ఇంటర్ ఎంపీసీ చదువుతుంది నిన్న ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్ ఫలితాలలో 1000/985 మార్కులు సాధించి తన సత్తా చాటింది. నిరుపేద కుటుంబం నుండి వచ్చినటువంటి మాకు కూతురు సాధించిన మార్కులతో చాలా గర్వంగా ఉందని, మంచి యూనివర్సిటీలో ఐఐటీ సీట్ సాధించాలని ఆశగా ఉందని తల్లిదండ్రులు అన్నారు. మరో విద్యార్థిని నిమ్మలగూడెం గ్రామానికి చెందిన తుంపురు శ్రీనివాస్ సునీత దంపతుల కుమార్తె తుంపురు హాసిని హైదరాబాద్ గౌలిదొడ్డి గురుకుల పాఠశాలలో చదువుతూ ఇంటర్ బైపీసీలో 1000/ 964 మార్కులు సాధించింది. ఇదే గ్రామానికి చెందినటువంటి గుర్రం చుక్కారావు వెంకటలక్ష్మి దంపతుల కుమార్తె గుర్రం సిరి ఇంటర్ మొదటి సంవత్సరంలో 461/470 మార్కులు సాధించడం పట్ల తల్లిదండ్రులు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు

# టెన్త్ ఫలితాల్లో కలిదిండి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థుల ప్రభంజనం.



**కలిదిండి ఏప్రిల్ 23 (వార్తా ప్రభ)** ఈరోజు విడుదలైన టెన్త్ 2025 ఫలితాలలో కలిదిండి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ విద్యార్థుల ప్రభంజనం. సృష్టించారు.ఈ సంవత్సరం కలిదిండి మండలం ప్రైవేట్ స్కూల్స్ లో ఫస్ట్ మరియు సెకండ్ ర్యాంకులను కైవసం చేసుకొంది.కలిదిండి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ .రేష్మిక 574 మార్కులతో,కట్టా వాసు 571 మార్కులతో కలిదిండి మండల ప్రథమ మరియు ద్వితీయ స్థానాలను కైవసం చేసుకుని విజయకేతనం ఎగురవేసినారు. 100% పాస్ రిజల్ట్స్ తో మరొకసారి సత్తా చాటిన కలిదిండి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ మొత్తం 37 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 15 మంది విద్యార్థులకు 500 కు పైగా మార్కులు సాధించారు.ఈ సందర్భంగా కలిదిండి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ చైర్మన్ వెంకట రామారావు,మీనా సరస్వతి మరియు స్కూల్ కరస్పాండెంట్ కోన కేశవరావు మరియు ప్రిన్సిపల్ కొండేటి జయ పాండురంగారావు,స్కూల్ అకాడమిక్ డైరెక్టర్ జాస్తి శైలజ మాట్లాడుతూ,ఇంతటి ఘన విజయాన్ని సాధించిన విద్యార్థులకు ఉపాధ్యాయులకు మరియు తల్లిదండ్రులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా కలిదిండి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ భవిష్యత్తులో మరెన్నో విజయాలు సాధించి, విద్యార్థులు బంగారు భవిష్యత్తుకు బసటగా నిలుస్తుంది.అని కొనియాడారు.

# యువత బానిసలుగా మారొద్దు...

**● సన్మార్గం, సత్ప్రవర్తనతో మేలుగు... ● గంజాయి, మత్తు మందులకు దూరం కండి...మద్యం, సిగరెట్లను విడనాడండి... ● బైక్ రైడర్స్... సిరాశాస్త్రం శిరశాస్త్రం తప్పనిసరి... ●ఫ్రెండ్లీ పోలీసింగ్ కు పెద్దపీట వేస్తున్న చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి.**



**చంద్రగిరి :ఏప్రిల్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)** యువకులు అప్రమత్తంగా ఉండండి, వ్యసనాలకు బానిసలు కావద్దు. తల్లిదండ్రులకు గర్భశోకం మిగల్చొద్దు.ఏదైనా సమస్యలు ఉంటే తల్లిదండ్రులతోనూ, సన్నిహితులతోనూ చర్చించండి. ఇంకా ఇబ్బందికర పరిస్తితులు దాపరిస్తే పోలీసులను ఆశ్రయించండి. మీకు అండగా మేము ఉంటాం. అల్లరి మూకల తాటతీస్తాం అంటూ చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి చంద్రగిరి గ్రామ యువతకు భరోసా ఇచ్చారు. మండలంలో గంజాయి ముఠాల స్వైర విహారం , అల్లరి మూకల ఆకతాయి పనులు ,రుణాల పేరిట మోసం చేసేవారు, అధిక వడ్డీలు, అదనపు సొమ్ము ఇస్తాం అంటూ నమ్మించే ముఠాలు, విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుపేదలను నిలువు దోపిడీ చేసే దగాకోరులు ఆగడాలపై అవగాహన కల్పించేందుకు సీఐ సుబ్బారావు రెడ్డి వార్తా ప్రభ ప్రతినిధులతో మాట్లాడుతూ... తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశానుసారం ఫ్రెండ్లీ పోలీసింగ్కు పెద్దపీట వేస్తున్నామని పౌరులు ప్రతి సమాచారాన్ని పోలీసులకు చేరవేయాలని సూచించారు. దొంగల ముఠాలు తారసపడితే వెంటనే తమకు సమాచారం ఇస్తే తాటతీస్తామంటున్నారు మన చంద్రగిరి సీఐ సుబ్బరామిరెడ్డి. మండలంలో ఎవరు కూడా అధైరపడుద్దని మీకు అండగా పోలీస్ యంత్రాంగం ఎల్లవేళలా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. పల్లె నిద్రలో భాగంగా మండలంలోని అన్ని గ్రామాలలో అవగాహన శిబిరాలు నిర్వహిస్తూ యువతను, ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామన్నారు. వారంతా సమాజాన్ని జాగ్రత్తలు చేయాలని సీఐ సుబ్బారావు రెడ్డి పిలుపునిచ్చారు. అదేవిధంగా రోజురోజుకు వాహన ప్రమాదాలు ఎక్కువవుతున్నాయన్నారు. వాహన చోదకులు అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అన్నివేళలా సిరాసస్త్రం ధరించండి అని చెప్పారు. సురక్షితంగా ఇళ్లకు చేరండి వేగంతో వాహనాలు నడపొద్దు అని సీఐ సుబ్బరామిరెడ్డి సూచించారు. ఈ అంశాలకు సంబంధించి గ్రామాలలో యువకులకు ,గ్రామ ప్రజలకు అవగాహన శిబిరాలు నిర్వహిస్తున్నామని సీఐ చెప్పారు. చంద్రగిరి సమీప గ్రామాలలో బ్యాంకుల్లో రకరకాలు రుణాలు ఇప్పిస్తాం. ముందుగా అడ్వాన్స్ రూపంలో 20000 30,000 40,000 ఇవ్వండి అంటూ ఫోన్ పేరు చేయించుకుంటున్న ముఠాల న్యూసెన్స్ ఎక్కువగా ఉందని, ఈ దొంగల ముఠాల సభ్యులు ఫోన్పే ద్వారా నగదు ఖాతాకు జమ అయిన వెంటనే ఉడయించేస్తున్నారని ఆ తర్వాత ఫోన్లు చేసిన సమాధానం ఇవ్వకుండా ,మనుషులు దొరకరని దీంతో బాధితులు బోరున విలపిస్తున్నారని ఆయన అన్నారు. వీరిపై వరుస ఫిర్యాదులు అందుతున్నాయని అటువంటి వారి పట్ల అప్రమత్తంగా ప్రజలు ఉండాలని ఎక్కడైనా తారసపడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సిఐ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువత లక్ష్యంగా దగాకోరు ముఠాలు పనిచేస్తున్నాయి. విదేశాల్లో ఉద్యోగాలు ఇస్తామంటూ నమ్మబలుకుతున్నారన్నారు. దీనినే అదునుగా తీసుకొని అభ్యర్థుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేస్తున్నారని, ఆ తర్వాత జాడ లేకుండా పోతున్నారని ఆయన తెలిపారు .కావున చంద్రగిరి మండలంలోని ప్రజలు ఇటువంటి ముఠాల బారిన పడద్దని సీఐ సూచించారు.

# జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు లక్ష రూపాయలు నగదు పురస్కారం అందించిన కడియాల కాశీ అన్నపూర్ణ



**హనుమాన్ జంక్షన్, ఏప్రిల్ 23 (వార్తాప్రభ)** జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భాన్ని పురస్కరించుకొని దాత కడియాలకాశీ అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివిన పిల్లలు ఉన్నత లక్ష్యాలతో సమున్నత స్థానాలను అది రోహిస్తున్నారని కొనియాడారు.ఈ పాఠశాల ఉన్నత ప్రమాణాలతో నడుపుతున్నందుకు అభినందించారు. 2024 సంవత్సరంలో 10 వ తరగతి ఫలితాలలో ఉత్తమ ప్రతిభ కనపర్చి 584 మార్కులు సాధించిన సైరాభాను కు 25 వేల రూపాయల నగదు, 552 మార్కులు సాధించిన టి.కిర్తన కు 20 వేల రూపాయల నగదు, 500 మార్కులు పైగా సాధించిన 5 గురు విద్యార్థులకు 5 వేల రూపాయలతో పాటు ఇంటర్మీడియట్ లో కాలేజీ 1,2 వచ్చిన షేక్ రబియా, టి. నాగ త్రివేణి లకు 5 వేలు చొప్పున మొత్తం1 లక్ష రూపాయలు కీ“శే. డాక్టర్ కడియాల రామారావు నగదు పురస్కారాన్ని కడియాల కాశీ అన్నపూర్ణ అందజేశారు.

# బాపులపాడు జడ్ పి హెచ్ స్కూల్ ఎస్ ఎస్ సి 80% ఉత్తీర్ణత



**హనుమాన్ జంక్షన్, ఏప్రిల్ 23(వార్తాప్రభ)**జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల బాపులపాడు విద్యార్థులు 80% శాతం ఉత్తిర్ణత తో విజయ కేతనం ఎగురవేశారని ప్రధానోపాధ్యాయులు టీ. వీ. నాగేశ్వరరావు తెలిపారు. వి. మానస వీణ 537 మార్కు లతో ప్రథమ స్థానం లో నిలువగా,, జి. హేమ లత(535), కె. స్వప్న ( 528), ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించారు.500 మార్కులు పైగా 6 గురు విద్యార్థులు తెచ్చు కున్నారు. ఉపాధ్యాయులు అందరూ విద్యార్థులను అభినందించారు.

## ఉచిత కుట్టు మిషన్ శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కామినేని.



**కలిదిండి ఏప్రిల్ 23 (వార్తా ప్రభ)** ఈరోజు బీసీ సంక్షేమ శాఖ అద్వర్యంలో కలిదిండి మండలం, కలిదిండిలో రైతు భరోసా కేంద్రం నందు ఉచిత కుట్టు మెషిన్ శిక్షణ కార్యక్రమంను శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కామినేని మాట్లాడుతు, ఆడబిడ్డలకు ఆసరాగా నిలుస్తూ, ఉచితంగా కుట్టు మెషిన్ నేర్పిస్తూ స్వయం ఉపాధికి శ్రీకారం చుట్టింది అని అన్నారు. మహిళా సాధికారతే ధ్యేయంగా ఈ ప్రభుత్వం పనిచేస్తుంది అని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# అమలాపురం మాస్టర్ ప్లాన్ తయారు అయ్యింది

***కాకినాడ, రాజమహేంద్రవరం లా అమలాపురం అభివృద్ధి చెందాలి***

***అపోహలు వద్దు... అవసరం మేరకే రోడ్ల అభివృద్ధి : ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు***



**అమలాపురం, ఏప్రిల్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)** మాస్టర్ ప్లాన్ తో పట్టణం ఎంతో అభివృద్ధి చెందుతుందని శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు అన్నారు. కొందరు తమ స్వార్ధం కోసం కోర్టులను ఆశ్రయించినట్లు చెబుతున్నారని ఈ చర్యలు ఖండించాలన్నారు. 2050 జనాభా ప్రాతిపదికన మాస్టర్ ప్లాన్ తయారయింది అన్నారు. స్థానిక అవసరాలకు తగ్గట్టుగా రోడ్లు అభివృద్ధి చేసుకుంటామే తప్పా అనవసరంగా కొట్టివేతలు ఉండవు అని ఎమ్మెల్యే అన్నారు. మాస్టర్ ప్లాన్ ప్రకారం 80 అడుగులు ఉన్నచోట ప్రస్తుతానికి 63 అడుగులు తీసుకుని డెవలప్మెంట్ చేస్తామన్నారు.జాతీయ రాష్ట్ర రహదారులకు అనుసంధానమైన పట్టణ రోడ్లు అన్నీ 40 అడుగులుగా మాస్టర్ ప్లాన్ లో పొందుపరిచారు. అన్నారు. అవసరం మేరకే రోడ్లు తీసుకుని అభివృద్ధి చేస్తామని ఎమ్మెల్యే అన్నారు. మాస్టర్ ప్లాన్ అనుగుణంగా పట్టణం పునర్నిర్మాణం జరుగుతుందన్నారు. కొత్తగా నిర్మాణాలు చేపట్టే వాటికీ కొత్త మాస్టర్ ప్లాన్ నిబంధనలు వర్తిస్తాయన్నారు. వెంటనే రోడ్లు వెడల్పు చేస్తారని జరుగుతున్న ప్రచారం సరి అయినది కాదన్నారు.జిల్లా ప్రధాన కేంద్రానికి అవసరాలకు అనుగుణంగా ఆక్రమణలు తొలగిస్తారు తప్పా మాస్టర్ ప్లాన్ అనుగుణంగా కొట్టి. వేతలు ప్రస్తుతం ఉండవని ఎమ్మెల్యే ఆనంద రావు స్పష్టం చేశారు.

# పది ఫలితాల్లో ఠాగూర్ పాఠశాల విజయ కేతనం



**అనుమసముద్రంపేట ఏప్రిల్ 23 (వార్తాప్రభ)** మండల కేంద్రమైన ఏఎస్ పేటలోని ఠాగూర్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన విద్యార్థులు10వ తరగతి పరీక్షా ఫలితాల్లో నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించి ప్రతిభ కనబరిచి విజయ దుందుభి మ్రోగించారు. ఠాగూర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు 37 మంది పరీక్షలకు హాజరుకాగా 37 మంది ఉత్తీర్ణులైన నూరు శాతం ఉత్తీర్ణతతో ప్రథమ స్థానంలో నిలిచారు పాఠశాలకు చెందిన ఎండి అప్స (584) మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది.అలాగే ద్వితీయ స్థానంలో సోమల సంజీవని (581) మార్కులు తృతీయ స్థానంలో ఎం హనీప్రియ (578) మార్కులు సాధించి ప్రతిభ కనబరిచారు. అలాగే 550 కి పైన మార్కులు సాధించిన విద్యార్థుల సంఖ్య 11 మంది 500 పైన మార్కులు సాధించిన విద్యార్థులు 20 మంది ఉన్నారని ఠాగూర్ పాఠశాల కరస్పాండెంట్ సిహెచ్ వెంకటరమణారెడ్డి డైరెక్టర్ కె దొరస్వామి రెడ్డి తెలిపారు.ఈ సందర్భంగా పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందనలు తెలియజేశారు విద్యార్థుల విజయానికి దోహదపడిన ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులకుధన్యవాదాలు తెలియజేశారు.

## పదో తరగతి ఫలితాల్లో జిల్లాలో చంద్రిక కు ప్రథమ స్థానం



**అమలాపురం ఏప్రిల్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి)** అమలాపురం చైతన్య పాఠశాలలో పదో తరగతి ఫలితాలలో బుచ్చమ్మ అగ్రహారానికి చెందిన తురగా మధు చంద్రిక 597 మార్కులతో అంబేద్కర్ కోనసీమ జిల్లా స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచింది.

## మైలవరం ప్రభుత్వ స్కూల్స్ లో టెన్త్ ఉత్తీర్ణత 71 శాతం

### మండలంలో 507 మంది పరీక్షకు హాజరు కాగా ఉత్తీర్ణులైన వారు 361 మంది
### ఏ ఒక్క స్కూల్లోనూ సెంట్ పెర్సెంట్ రానివైనం
### 593 మార్కులతో మండలం ఫస్ట్ సాధించిన పసుపులేటి నందిని(మైలవరం జెడ్పి బాలికల పాఠశాల)




**మైలవరం:ఏప్రిల్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలలో ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 71 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.మండలంలోని 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక ప్రభుత్వ పాఠశాల,ఆంధ్రప్రదేశ్ ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ కలిపి మొత్తం 507 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవ్వగా వీరిలో 361 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.చిలుకూరివారి గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 74.15 శాతం, చంద్రగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 72. 41, మైలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలురు) 73.33, మైలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలికలు) 83.09 శాతం, మైలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 48 శాతం, వెల్వడం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 71.42, చంద్రాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 62.06,పొందుగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 41.17 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

**శభాష్ నందిని....!** మైలవరం ఎం బి ఎం జిల్లా పరిషత్ ఉన్నత బాలికల పాఠశాల(హైస్కూల్ ప్లస్)కు చెందిన పసుపులేటి నందిని 593 మార్కులు సాధించి మైలవరం మండలం ప్రథమ స్థానం కైవసం చేసుకొని శభాష్ అనిపించుకుంది.అలాగే చిలుకూరివారి గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వి.జ్యోతి ప్రసన్న 584 మార్కులు సాధించి మండలం ద్వితీయ స్థానం దక్కించుకుంది.

**ప్రభుత్వ హైస్కూల్, పొందుగల హైస్కూల్ లలో దారుణమైన ఫలితాలు:** మైలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, పొందుగల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ ఫలితాలు దారుణంగా వచ్చాయి.మైలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 75 మంది విద్యార్థు లు పరీక్షకు హాజరు కాగా కేవలం 36 మంది విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.అలాగే మండలంలోని పొందుగల గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 17 మంది విద్యార్థులు పరీక్ష రాయగా కేవలం ఏడుగురు మాత్రమే ఉత్తీర్ణులయ్యారు.ఈ ఫలితాలు చూస్తేనే అర్ధమవుతుంది ఈ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య ఏ మేరకు అందిస్తున్నారో అని ఆయా గ్రామస్తులు వాపోతున్నారు.

## 594 మార్కులతో పట్టణంలో ద్వితీయ స్థానం పొందిన త్రివిధ పాఠశాల విద్యార్థిని చరితశ్రీ



**నూజివీడు: ఏప్రిల్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి)**పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో నూజివీడు త్రివిధ పాఠశాలకు చెందిన విద్యార్థిని బోనాల చరితశ్రీ అత్యధిక మార్కులు సాధించి పట్టణంలో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు త్రివిధ పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూజివీడు కేంద్రంగా చుట్టుపక్కల సుమారు 40 గ్రామాలకు చెందిన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలనే ఉద్దేశంతో పాఠశాలను స్థాపించి, అందుకు తగ్గట్లుగానే ఫలితాలను సాధిస్తున్నట్లు తెలిపారు. గత పది సంవత్సరాలకు పైబడి అత్యుత్తమ ఫలితాలు సాధించడం జరిగిందన్నారు. దానికి ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థుల కఠోర శ్రమ కారణం అన్నారు. ఈ సంవత్సరం పాఠశాల నుండి పదవ తరగతి పరీక్షకు 202 మంది హాజరు కాగా 199 మంది ఉత్తీర్ణులైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపల్ శ్రీనివాస్, ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

## మొక్కజొన్న పంట దగ్ధం సంఘటనలో కీలక మలుపు

### ట్రాన్స్ఫార్మర్ పేలలేదు, షార్ట్ సర్క్యూట్ జరగలేదు
### విద్యుత్ అధికారుల వివరణ



**ఇబ్రహీంపట్నం ఏప్రిల్ 23(వార్తా ప్రభ ప్రతినిధి):**మండల పరిధిలోని కొటికలపూడి శివారులో బుధవారం అగ్నిప్రమాదం జరిగింది. పొలాల్లో ట్రాన్స్ ఫార్మర్ పేలడంతో మొక్కజొన్న పంట దగ్ధమైన సంఘటనలో విద్యుత్ అధికారులు స్పందించారు. ట్రాన్స్ఫార్మర్ పేలలేదని, ప్రమాదానికి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణం కాదని... ట్రాన్స్ఫార్మర్ మరియు లీడర్లు అన్ని సక్రమంగా ఉన్నాయని విద్యుత్ శాఖ అధికారులు వివరణ ఇచ్చారు.

## మండలమంతా ఒకే మాట... జీపీ నరసింహం పాఠశాల వైపే ఫలితాల బాట

### 581 మార్కులతో వి.సుప్రీతి మండల స్థానం కైవసం



**నెల్లూరు ఏప్రిల్ 23 (వార్తాప్రభ)** పదోవ తరగతి పబ్లిక్ పరీక్ష ఫలితాలలో తమ విద్యార్థులు విజయ కేతనం ఎగురవేశారని రాపూరులోని జీపీ నరసింహం పాఠశాల కరస్పాండెంట్ బొలిగర్ల శివ కుమార్ ప్రధానోపాధ్యాయులు బిల్లు చెంచురత్న ప్రసాద్ పేర్కొన్నారు.పదోవ తరగతి ఫలితాల్లో 600 మార్కులకు గాను వి.సుప్రీతి 581 మార్కులు సాధించి మండల ప్రథమ స్థానంలో నిలువగా వి.గీతికా 569మార్కులు మొహ్మద్ షోయబ్ 569 కె.శ్రీనివాసులు 568 యం. ప్రవీణ 564 మోహిత్ 559 కె.గీతికా రెడ్డి 553 హానిఫా బాను 552 టి.శృతి 526 క్రాంతి కళ్యాణ్ 517 పి.వర్షిత 514 అలిమా సాదియా 503 మార్కులు సాధించారన్నారు.550 మార్కులకు పైగా ఎనిమిది మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా 12 మంది విద్యార్థులు మార్కులు సాధించారని వెల్లడించారు ఘన విజయం సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఒక సమావేశంలో అభినందించింది.ఈ సందర్భంగా విజేతలైన విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం ప్రోత్సాహం ఉపాధ్యాయులు అంకిత భావంతో కూడిన చక్కటి విద్యా బోధనతో తాము ఈ మార్కులు సాధించ గలిగామని తెలిపారు.పాఠశాల కరస్పాండెంట్ బొలిగర్ల శివ కుమార్ మాట్లాడుతూ తమ విద్యార్థులు మండల స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించడం గర్వకారణంగా ఉందన్నారు. ఉత్తమ ఫలితాలతో తమ పాఠశాల అభివృద్ధికి సహకరిస్తున్న విద్యార్థులకు,వారి తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బిల్లు చెంచు రత్న పరసాద్ డైరెక్టర్లు బి.శ్రీలక్ష్మి కె రమ పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పదవ తరగతి లో మండల ప్రథమ స్థానం సాధించిన ఎం. సూరవరం విద్యార్థి




**ఆగిరివల్లి, ఏప్రిల్ 23,(వార్త ప్రభ ):** ఏలూరు జిల్లా,ఆగిరిపల్లి మండలం పదవ తరగతి ఉత్తమ ఫలితాలలో ప్రథమ స్థానం సాధించిన ఎం. సూరవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి జి. జనార్ధన్ బాబు 588మార్కులు సాధించి మండల ప్రథమ స్థాయిలో నిలిచినది. రెండవ స్థానం ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని నక్క హేమ నాగ త్రివేణి 582 మార్కులతో ఉత్తీర్ణులు మండలంలో ద్వితీయ స్థానం సాధించారు. తృతీయ స్థానంలో ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మట్టా సాయి తేజస్విని 569 మార్కులు ఉత్తీర్ణులై తృతీయ స్థానం సాధించారు. మండలంలో ని పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయనీలు విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆగిరిపల్లి విద్యాధికారి-1 కె.ఆనంద్ కుమార్ మాట్లాడుతూ ఆగిరిపల్లి మండలంలోని పదవ తరగతి పరీక్షలు 378 మంది విద్యార్థుల పరీక్ష రాయగా 264 మంది విద్యార్థులకు ఉత్తీర్ణులయ్యారు అని, 2024లో 70% ఉత్తీర్ణులు అయ్యారని 2025 లో 69.9% ఉత్తీర్ణులయ్యారని, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆగిరిపల్లి మండల విద్యాధికారి అభినందనలు తెలియజేశారు.

## ఎస్ఎస్సి ఫలితాలలోవిద్యాలయ విద్యార్థుల ప్రతిభ




**గుడివాడ :ఏప్రిల్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి)** కుప్పిలి కృష్ణ మణికుమార్ విద్యార్థికి 586 మార్కులతో మొదటి స్థానములో నిలిచాడు. విద్యాలయ విద్యార్థులు 550 మార్కులు దాటిన వారు 14 మంది, 500 మార్కులు దాటిన వారు 40 మంది.. అలాగే ప్రథమశ్రేణి 88, ద్వితీయ శ్రేణి 4, తృతీయశ్రేణి లో ఇద్దరు మార్కులను సాధించారు. ఈవిధంగా మంచిమార్కులు సాధించి వారినత్త నిరూపించుకున్నదుగాను, పేరెంట్స్ మాట్లాడుతూ మా పిల్లలకు సంతృప్తికర ఫలితాలు సాధించినందుకు ఆనందాన్ని వ్యక్తం చేశారు. పాఠశాల అధినేత బొప్పన వెంకట విజయ భాస్కర్, శాంతి, పేరెంట్స్, విద్యార్థులను అభినందించారు.

## ఎస్ఎస్సి ఫలితాలలో విద్యావికాస్ విజయదుందుభి




**గుడివాడ :ఏప్రిల్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి)**: బుధవారం ప్రకటించిన 10వ తరగతి ఫలితాలలో విద్యావికాస్ మరోసారి విజయదుందుభి మ్రోగించిందని విద్యావికాస్ డైరెక్టర్ కొమ్మినేని సాంబశివరావు తెలియజేసారు. 590 మార్కులతో కొల్లారెడ్డి పూర్ణిమ ప్రథమ స్థానం, 588 మార్కులతో సంకురాత్రి నాగసాయి ద్వితీయ స్థానం, 584 మార్కులతో పెరుమాళ్ళు తరణీసాయి తృతీయ స్థానం సాధించారు. అలాగే వరుసగా నాలుగవ సారి కూడా విద్యావికాస్ ఆల్ ఫస్ట్ క్లాసులు సాధించడమే కాక 15మంది 550 పైబడి మార్కులు సాధించడం ఓ అద్భుతం అని అన్నారు. 100శాతం ఉత్తీర్ణత సాధించడమే కాక హాజరయిన వారిలో సగం మందికి పైగా 500 ఆపైన మార్కులు సాధించారని అన్నారు. తెలుగులో 100కు 100 మార్కులు ఆరుగురు.. మ్యాథ్స్‌లో 100కు 100 మార్కులు ఆరుగురు, సైన్స్‌లో 100కు 100 మార్కులు ఆరుగురు సాధించారని అలాగే సోషల్ సబ్జెక్ట్‌లో 100కు 100 మార్కులు ఇద్దరు సాధించడం మాకు గర్వకారణం అని అన్నారు. అద్భుత విజయాలు సాధించిన చిన్నారులను డైరెక్టర్ సాంబశివరావు, అకడమిక్ డైరెక్టర్ వెల్లంకి రేష్మా చౌదరి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ కొమ్మినేని నిష్ఠాత్ లు అభినందించారు. అత్యధిక మార్కులు సాధించిన చిన్నారులు తమ ప్రతిస్పందన తెలియజేస్తూ మా ఈవిజయానికి కారకులు మా పెద్ద సార్ విద్యావికాస్ ఫౌండర్ డైరెక్టర్ ముప్పాళ్ళ సుబ్బారావుగారని.. అహర్నిశలు మాపై ప్రత్యేక శ్రద్ధ వహించి మాకు మంచి మార్కులు రావడానికి తోడ్పడ్డారని, ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామని అన్నారు.

## 597 మార్కులతో గుడివాడ -విశ్వభారతి విద్యార్థి సంచలనం



**గుడివాడ :ఏప్రిల్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి)** బుధవారం వెలువడిన పదవ తరగతి ఫలితాలలో గుడివాడ విశ్వభారతి ఇంగ్లీష్ మీడియం విద్యార్థి కోరుకొండ ప్రేమ్ కుమార్ అత్యధికంగా 597 మార్కులతో సంచలన విజయం సాధించాడు. 596 మార్కులతో కె.వర్షిత స్కూల్ సెకెండ్ ర్యాంక్ సాధించారు. 917 మంది విద్యార్థులు పరీక్షకు హజరుకాగా, అందరికి ఫస్టు క్లాసులు రావటం విశేషం.. 26మంది విద్యార్థులు 590కి పైగా మార్కులు సాధించగా, 162మంది విద్యార్థులు 580కి పైగా, 376మంది విద్యార్థులు 570 మార్కులు పైగా, 546మంది విద్యార్థులు 560కి పైగా. 663మంది విద్యార్థులు 550కి పైగా మార్కులు సాధించారు. 917 మంది విద్యార్థులలో 856 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించటం ఓ రికార్డ్. స్కూల్ యావరేజ్ మార్కు 557 గా నమోదవటం విశేషం. అద్భుతమైన విజయాలను సాధించిన విద్యార్థులను, విజేతలను తీర్చిదిద్దిన ఉపాధ్యాయ బృందాన్ని విశ్వభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ అభినందించారు.

## గోవులకు దాణా (మినపనూక )వితరణ



**పెనుగంచిప్రోలు,ఏప్రిల్ 23( వార్త ప్రభ )** ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రములోని ఎన్టీఆర్ జిల్లా పెనుగంచిప్రోలు గ్రామంలో కొలువై ఉన్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానం లో గోవులకు ఎన్టీఆర్ జిల్లా నందిగామ పట్టణం నకు చెందిన గో ప్రేమికులు వ్యాపార వేత్త చల్లా వెంకట నరసయ్య వారి ధర్మపత్ని భారతీ వారి కుమారుడు ఆనంద్ దేవాగుప్తా రాధిక గార్లు 10. క్వింటాళ్ళ మినపనూక .(సుమారు ఇరువది ఒక్క వెయ్యిరూపాయల విలువగల )దాణా నూ గోవులకు సమర్పించినారు . వారికి దేవస్థానం డిప్యూటి కమిషనర్ మరియు కార్య నిర్వహణ అధికారి కిశోర్ కుమార్ మరియు చైర్మన్ జంగాల శ్రీనివాస్ అభినందనలు తెలిపినారు.

## పోడూరు మండలం టాపర్స్ కి అభినందనలు



**పోడూరు: ఏప్రిల్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి)**ఈరోజు ప్రకటించిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాలలో పోడూరు మండల స్థాయిలో జిన్నూరు జెడ్ పి హైస్కూల్ విద్యార్థి కొత్త వై.ఎస్.వై.ఎస్.ఆర్. వీర గుప్త 571 మార్కులతో మండల ప్రథమ స్థానం, గుమ్మలూరు జెడ్. పి. ఓరియంటల్ హైస్కూల్ విద్యార్థి పోతాబత్తుల దేవీ భవజ్ఞ 561 మార్కులతో మండల ద్వితీయ స్థానం, జిన్నూరు జెడ్ పి హైస్కూల్ విద్యార్థి బొంతు కీర్తి జ్ఞాన వర్షిత 550 మార్కులతో మండల తృతీయ స్థానం పొందిన పొందిన విద్యార్థులను పోడూరు మండల విద్యాశాఖాధికారులు జి.విజయ కుమార్, జి. వి.సూర్యనారాయణ పుష్పగుచ్చం ఇచ్చి అభినందనలు తెలియచేశారు. మొత్తం మీద పోడూరు మండలంలో 62.5% ఉత్తీర్ణత సాధించినట్లు తెలియచేశారు.మండల టాపర్స్ గా నిలిచిన విద్యార్థులకు, శిక్షణనిచ్చి ప్రోత్సహించిన ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయులను అభినందించారు.

## టెన్త్ లో 600/596 మార్కులు సాధించిన నూజివీడు కుమార్ స్కూల్ విద్యార్థిని డింపుల్



**నూజివీడు:ఏప్రిల్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి)** పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన నూజివీడు కుమార్ స్కూల్ విద్యార్థిని డింపుల్ సరికొత్త రికార్డు సృష్టించింది. 600/596 మార్కులు సాధించి నూజివీడులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినిగా రికార్డు సృష్టించడం జరిగింది. ఈ సందర్భంగా కుమార్ విద్యాసంస్థల అధినేత పిన్నమనేని వెంకట్ కుమార్ మాట్లాడుతూ కుమార్ పాఠశాలను స్తాపించి 25 సంవత్సరాలు గడుస్తుందని, దాదాపు 20 సంవత్సరాలుగా పదవ తరగతి పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధిస్తున్న ఏకైక విద్యా సంస్థగా నిలవడం ఆనందంగా ఉందన్నారు.పాఠశాలకు చెందిన విద్యార్థులు మొత్తం 192 మంది పరీక్షలకు హాజరు కాగా 188 మంది ఉత్తీర్ణత సాధించారని, వారిలో 8 మంది విద్యార్థులకు 590కి పైగా మార్కులు వచ్చినట్లు పిన్నమనేని వెంకటకుమార్ తెలిపారు. పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులపై విద్యార్థుల తల్లిదండ్రులు ఉంచిన నమ్మకాన్ని ఉత్తమ ఫలితాలు సాధించి నిలబెట్టుకుంటామన్నారు. పదవ తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.అదేవిధంగా ఇంటర్ లో బైపీసీ చదివి భవిష్యత్తులో వైద్య వృత్తిలో గైనకాలజిస్ట్ గా రాణించాలన్నదే తన కోరిక అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థిని డింపుల్ తెలిపారు.

## పిల్లలని సెల్ ఫోన్ కి టీవీలకి దూరంగా ఉంచాలి

**కంకిపాడు ఏప్రిల్ 23 (వార్త ప్రభ, ప్రతినిధి)**మొన్న కేంద్రమైన, గ్రామాలలోని అంగన్ వాడి సెంటర్లో కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు 7వ పౌష్టికాహార పక్షోత్సవ కార్యక్రమం చివరి రోజు నిర్వహించారు. దీనిలో భాగంగా సూపర్వైజర్ అన్నామని పాల్గొని పిల్లలకు పౌష్టిక ఆహారం, వ్యాయామాలపై అవగాహన కల్పించాలని, టీవీలకు, సెల్ ఫోన్ లకు దూరంగా ఉంచాలన్నారు. కుటుంబం మొత్తం కలిసి భోజనం చేయాలి తినే ఆహార పదార్థాలు అన్ని రకాల పౌష్టికాహారం ఉండేలాగా తల్లులు జాగ్రత్త తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, టిడిపి ప్రతినిధులు కంకిపాటి రమేష్, శివపార్వతి తదితరులు పాల్గొన్నారు.



## ఎంపీ చిన్ని పై బురదజల్లే రాజకీయం మానుకోవాలి

**మాజీ ఏఎంసి డైరెక్టర్ గరిమెళ్ళ లోకేశ్వరరావు**



**విస్సన్నపేట ఏప్రిల్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)**విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని( చిన్ని) శివనాద్ పై రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పిన మాజీ ఎంపీ కేశినేని నాని సన్నాయి నొక్కులను నొక్కటం చంద్రన్న ఆశీస్సులు కొరకేనని తిరువూరు ఏఎంసీ మాజీ డైరెక్టర్ గరిమెళ్ళ లోకేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నా క్యాంటీన్ లు, మెడికల్ క్యాంపులు ఉచిత రిక్షాలు తోపుడుబండ్లు పంపిణీ, డయాలసిస్ పరీక్షలు తిరువూరు శాసనసభ్యులు కొలికపూడి శ్రీనివాసరావు సంయుక్త సహకారంతో లక్ష్మీపురం లో కోచింగ్ సెంటర్ ఏర్పాటు ఇవన్నీ సేవే లక్ష్యంగా చేస్తూ ఉంటే ఓర్వలేక అవాకులు చవాకులు పేలటం విచిత్రంగా ఉండదన్నారు. ఇలాంటివి మానుకోవాలని రాజకీయంగా సన్యాసం తీసుకున్న వ్యక్తి రాజకీయాల పట్ల ఉత్సాహం చూపటం టిడిపి తీర్థం కొరకైనని చెప్పకనే చెప్పినట్లు ఉన్నదన్నారు. గజకర్ణ గోకర్ణ టక్కు టమార విద్యలు తెలుగుదేశం పార్టీ అధినేత ముందు పనికిరావు అన్నారు. మండల మహిళ టిడిపి అధ్యక్షులు సంబారు నాగలక్ష్మి, డైరెక్టర్ మురుగులు ప్రసాద్, వేమన, ఎం స్టాలిన్, ఎం నవీన్ కె నరేంద్ర బిజెపి జిల్లా నాయకులు కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.


## ఆక్స్ ఫర్డ్ హైస్కూల్ లో ఘనంగా స్నాత కోత్సవం



**జి.కొండూరు ఏప్రిల్ 23 (వార్తాప్రభ ప్రతినిధి):**స్థానిక ఆక్స్ ఫర్డ్ హైస్కూల్ లో యు కె జి విద్యార్థులకు బుధవారం స్నాత కోత్సవ కార్యక్రమం నిర్వహించారు.ముందుగా పాఠశాల చైర్మన్ కొల్లి నాగేశ్వరావు ప్రీ ప్రైమరీ విద్య పూర్తి చేసి ప్రాథమిక స్థాయి విద్య అభ్యశించబోతున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు.ప్రాథమిక స్థాయి లో తల్లిదండ్రులు పిల్లలపై మరింత శ్రద్ధ వహించాలని సూచించారు.అనంతరం సర్టిఫికెట్ లను విద్యార్థులకు అందజేశారు.స్నాత కోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమల్లో పాల్గొన్నారు.10 వ తరగతి లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

## పదవతరగతిలో 77 శాతం ఉత్తీర్ణత

**మెరిట్ విద్యార్థులను అభినందించిన ఎంఎల్ఎ కాగిత**



**పెడన ఏప్రిల్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)**పదవ తరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో పెడనలో 77% మంది ఉత్తీర్ణత సాధించారు. మొత్తం 7 జిల్లా పరిషత్ 1 డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులం మొత్తం 8 ప్రభుత్వ పాఠశాలల్లో 445 మందికి 318 మంది ఉత్తీర్ణులు (71%) అయ్యారని ఎం ఈ వో తెలిపారు.అదేవిధంగా ఏడు ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల నుండి 129 మందికి గాను 124 మంది ఉత్తీర్ణులు (94%) అయినట్లు తెలిపారు.మొత్తం మీద 15 పాఠశాల నుండి 574 విద్యార్థులకు కానీ 442 మంది ఉత్తీర్ణత (77%) సాధించారు. పెడన పట్టణం రూరల్ కలిపి అత్యధికంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెన్నూరు కి చెందిన పుప్పాల భువనేశ్వరి 589 మార్కులు సాధించింది.అదే పాఠశాలకు చెందిన యర్రం శెట్టి జాహ్నవి 582 మార్కులతో రెండవ స్థానంలోనూ కొండవీటి రేవతి 579 మార్కులతో మూడవ స్థానంలో నిలిచారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలలో విశ్వభరతి హై స్కూల్ కి సంబంధించిన ఉమ్మిటి నాగ లలిత 588 మండలంలో రెండవ స్థానం సాధించారు.. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఎం ఈ వో -1 ఎంవీఎస్ దుర్గ ప్రసాద్ ఎం ఈ వో -2 వై వి హరనాథ్ పెడన టౌన్ ఫస్ట్ సాధించిన చెన్నూరు పాఠశాల హెచ్.యం ఎస్ సౌజన్య విశ్వభారతి హై స్కూల్ ప్రిన్సిపాల్ గౌరీ ప్రసాద్ అభినందించారు.ఎం ఎల్ ఎ కాగిత కృష్ణప్రసాద్ కూడా మెరిట్ విద్యార్థుల ను అభినందించారు.

## వికాస్ విజయకేతనం

**వికాస్ విద్యాసంస్థల అధినేత నరెడ్ల నర్సిరెడ్డి**



**విస్సన్నపేట ఏప్రిల్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)** స్థానిక మండలంలో వికాస్ హై స్కూల్ విద్యార్థులు 10వ తరగతి పరీక్ష ఫలితాలలో విజయకేతం ఎగరవేసినట్లు వికాస్ విద్యాసంస్థల అధినేత నర్సిరెడ్డి నరెడ్ల విలేకరుల సమావేశంలో తెలియ జేశారు. డి లక్ష్మీప్రియ 590 మార్కులు సాధించి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకోగా బి అమృత 584 ,ఎం సృజత 5 82, ఎం షణ్ముఖ ప్రియ 578, జి గోపి కిరణ్ 575, ఐ మోనిషా 5 72, జి గోకుల్ కుమార్ రెడ్డి 570 సాధించగా 500 పైగా మార్పులు సాధించి 54 మంది తమ ప్రతిభను తెలిపారు అన్నారు. అధ్యాపక బృందానికి విద్యార్థినీ విద్యార్థులకు నర్సిరెడ్డి అభినందనలు తెలిపారు.

# జి.కొండూరు మండలంలో టెన్త్ ఉత్తీర్ణత 74 శాతం

**● మండలంలో 351 మంది పరీక్షకు హాజరు కాగా ఉత్తీర్ణులైన వారు 260 మంది ● సెంట్ పెర్సెంట్ తో మొదటి స్థానం దక్కించుకున్న కోడూరు జడ్పీ పాఠశాల ● 57 శాతం తో ఆఖరి స్థానంలో నిలిచిన కట్టుబడిపాలెం జడ్పీ పాఠశాల ● 582 మార్కులతో మండలం ఫస్ట్ సాధించిన గోళ్ళ ప్రణీత(కోడూరు) ● కుంటముక్కల అంబేద్కర్ గురుకులంలో 89.16 శాతం ఉత్తీర్ణత ● పరీక్ష రాసింది 83 మంది. పాస్ అయింది 74 మంది**

**జి.కొండూరు ఏప్రిల్ 23 (వార్తాప్రభ ప్రతినిధి):**రాష్ట్ర ప్రభుత్వం బుధవారం విడుదల చేసిన పదో తరగతి పబ్లిక్ పరీక్షా ఫలితాలలో ఎన్టీఆర్ జిల్లా జి.కొండూరు మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 74.07 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.మండలంలోని 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి మొత్తం 351 మంది విద్యార్థులు పరీక్ష కు హాజరవ్వగా వీరిలో 260 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించగా మిగిలిన 91 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు.జి.కొండూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 74.73 శాతం, వెలగలేరు 72.15, కవులూరు71.15, గంగినేనిపాలెం 68.75, కోడూరు 100, చెవుటూరు 73.53, కట్టుబడిపాలెం 57.14 శాతం మాత్రమే విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.దీంతో మండలంలో పదో తరగతి ఉత్తీర్ణశాతం గతేడాది తో పోలిస్తే ఈ ఏడాది కొద్దిగా పరవాలేదు అనిపించింది.జెడ్పి పాఠశాలలకు సంబంధించి కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 582 మార్కులతో గోళ్ళ ప్రణీత మండలం ప్రథమ స్థానం కైవసం చేసుకోగా వెలగలేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 567 మార్కులు సాధించిన అనుముల లలిత శ్రీ ద్వితీయ స్థానాన్ని దక్కించు కుంది.

**కుంటముక్కల అంబేద్కర్ గురుకులంలో 89.16 శాతం ఉత్తీర్ణత**

మండలంలోని కుంటముక్కల గ్రామ శివారు అంబేద్కర్ గురుకులంలో 89.16 శాతం మంది టెన్త్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.ఈ గురుకుల బాలికల పాఠశాల నుంచి 83 మంది పరీక్షకు హాజరు కాగా



74 మంది ఉత్తీర్ణత సాధించారు.పి.దివ్యశ్రీ అందరికంటే అత్యధికంగా 551 మార్కులు సాధించింది.

# టెన్త్ విద్యార్థి ఆత్మహత్య

**అర్జవాని గూడెంలో విషాదం**

**ఇక వారసుడు లేడని అమ్మానాన్న కన్నీరు మున్నీరు**

**కృత్తివెన్ను ఏప్రిల్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)**పదవ తరగతి పరీక్షలో మరో సారి ఫెయిల్ కావటంతో.. ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. కృష్ణాజిల్లా బంటుమిల్లి మండలం అర్జావాని గూడెంలో ఈ విషాదం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. అర్జావాని గూడెం గ్రామానికి చెందిన గోవాడ రామకృష్ణ ఓ మినీ వ్యాన్ డ్రైవరు. ఆయనకు ఒక కుమారుడు, ఓ కుమార్తె ఉన్నారు. కుమారుడు గోవాడ అనిల్ కుమార్ ( బిట్టు) పెద తుమ్మిడి హైస్కూలులో గత ఏడాది పదవ తరగతి చదివాడు. కానీ ఫెయిల్ అయ్యాడు. సప్లమెంటరీలోనూ కృతార్థుడు కాలేక పోయాడు. ఈ ఏడాది మళ్లీ పదవ తరగతి పరీక్షకు సిద్ధమయ్యాడు. మళ్లీ ఫెయిల్ కావటంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. బుధవారం ఉదయం తమ ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఏకైక వారసుడు అర్ధంతరంగా ఆత్మహత్య చేసుకోవటంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరయ్యారు. అర్జావానిగూడెం విషాదంలో మునిగిపోయింది. తమ బిడ్డకు పోస్టుమార్టం జరపొద్దని పోలీసులకు తల్లీదండ్రులు వేడుకున్నారు. గ్రామస్థులు సైతం తల్లిదండ్రులను ఓదార్చి, మద్దతు తెలిపారు.



# కొండపల్లిలో బాలికల హవా!

**- ప్రైవేట్ పాఠశాలల ఉత్తీర్ణత 93 శాతం**

**- ప్రభుత్వ పాఠశాలల ఉత్తీర్ణత 67 శాతం**



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి):** మండల పరిధిలోని ఐదు ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 314 మంది విద్యార్థులకు గాను 243 మంది ఉత్తీర్ణులయ్యారు. 153 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. కొండపల్లిలోని గిరిజన మరియు బీసీ రెసిడెన్షియల్ హాస్టల్ విద్యార్థిని విద్యార్థులు 109 మందికి 106 మంది ఉత్తీర్ణులయ్యారు. మండలంలో ప్రభుత్వ, రెసిడెన్షియల్ మరియు ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు మొత్తం 1207 మందికి గాను 1096 మంది ఉత్తీర్ణులయ్యారు. 222 మంది విద్యార్థులు ఫెయిల్ అయ్యారు. ప్రభుత్వ పాఠశాలల ఉత్తీర్ణత 67 శాతం కాగా గిరిజన మరియు బీసీ రెసిడెన్షియల్ పాఠశాలల ఉత్తీర్ణత 97 శాతం, ప్రైవేట్ పాఠశాలల ఉత్తీర్ణత 93 శాతం నమోదైంది

**. ప్రభుత్వ పాఠశాలల్లో టాపర్ గా జ్యోత్స్న** ప్రభుత్వ పాఠశాలల్లో కొండపల్లి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థిని దేవరకొండ జ్యోత్స్న 581 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలవగా ఇదే పాఠశాలకు చెందిన ఎం.వెంకట నాగమనస్విని 580 మార్కులతో ద్వితీయ స్థానంలో, బీసీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థి ఎం.రామ్ చరణ్ 579 మార్కులతో తృతీయ స్థానంలో నిలిచారు. జడ్పీ బాలికల హైస్కూల్ విద్యార్థినులను హెచ్ఎం పద్మలత, ఉపాధ్యాయులు దుశ్శాలువాలతో సత్కరించి పుస్తక బహుమతులు అందజేశారు.

**ప్రైవేటు పాఠశాలల్లో టాపర్ గా శ్రీ చైతన్య విద్యార్థిని ఆర్ జాస్మిత**590 మార్కులతో ద్వితీయ స్థానంలో ఆక్స్ఫర్డ్ పాఠశాల విద్యార్థిని షేక్ నఫియా నాజ్,589 మార్కులతో మూడో స్థానంలో నిలిచిన డిఏవి పాఠశాల విద్యార్థిని బి తేజస్విని నిలిచారు.

# పదోతరగతి ఫలితాల్లో కార్పోరేట్ కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల ఫలితాలు

**మండలంలో జి బి కే ఆర్ జిల్లా పరిషత్ హై స్కూల్ ఫ్లస్ మొదటి స్థానం**



**సంగం ఏప్రిల్ 23 (వార్తాప్రభ):** శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా సంగం మండలంలోని ఏడు ప్రభుత్వ పాఠశాలలు, ఒక గురుకుల పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులు బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాలలో మంచి ఫలితాలు సాధించారు. సంగం జెడ్పీ హై స్కూల్ లో 104 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా 75 మంది ఉత్తీర్ణత సాధించారు. స్వర్ణ భారతి అనే విద్యార్థి 584 మార్కులు సాధించి మండలం మొదటి స్థానం లో నిలవగా... ఆర్.సోఫియా అనే విద్యార్థి 581 మార్కులు సాధించి మండలం రెండో స్థానంలో నిలిచింది. గురుకుల పాఠశాలలో 81 మంది పరీక్షకు హాజరవగా... 72 మంది ఉత్తీర్ణత సాధించారు. కె. చిన్నారి అనే విద్యార్థి 547 మార్కులు సాధించి పాఠశాల మొదటి స్థానంలో నిలిచింది. తరుణవాయి జెడ్పీ హై స్కూల్ లో 25 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా 22 మంది ఉత్తీర్ణత సాధించారు. పి.మధు చరణ్ అనే విద్యార్థి 568 మార్కులు సాధించి పాఠశాల మొదటి స్థానంలో నిలిచారు. కొరిమెర్ల ప్రభుత్వ హై స్కూల్ లో 12 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా 10 మంది ఉత్తీర్ణత సాధించారు. డి .అమృత లహరి అనే విద్యార్థి 504 మార్కులు సాధించి పాఠశాల మొదటి స్థానంలో నిలిచింది. గాంధీజన సంఘం జెడ్పీ హై స్కూల్ లో 39 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా.. 31 మంది ఉత్తీర్ణత సాధించారు. టి. విమల అనే విద్యార్థి 546 మార్కులు సాధించి పాఠశాల మొదటి స్థానంలో నిలిచింది. దువ్వూరు జెడ్పీ హై స్కూల్ లో 40 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా 31 మంది ఉత్తీర్ణత సాధించారు. కె.రోహిత్ కుమార్ అనే విద్యార్థి 527 మార్కులు సాధించి పాఠశాల మొదటి స్థానంలో నిలిచారు.అన్నారెడ్డీపాలెం జెడ్పీ హై స్కూల్ లో 46 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా.. 24 మంది ఉత్తీర్ణత సాధించారు. పి.చరణ్ చరణ్ అనే విద్యార్థి 572 మార్కులు సాధించి పాఠశాల మొదటి స్థానంలో నిలిచారు.మర్రిపాడు జెడ్పీ హై స్కూల్ లో 52 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవగా.. 40 మంది ఉత్తీర్ణత సాధించారు. ఎస్ మన్మోహన్ అనే విద్యార్థి 560 మార్కులు సాధించి పాఠశాల మొదటి స్థానంలో నిలిచారు.

## నూతనంగా ఎంపికైన బార్ అసోసియేషన్ సభ్యులను అభినందించిన మంత్రి కొల్లు రవీంద్ర



**మచిలీపట్నం ఏప్రిల్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం బార్ అసోసియేషన్ కార్యవర్గాన్ని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అభినందించారు. ప్రెసిడెంట్ దివి పోతురాజు ,వైస్ ప్రెసిడెంట్ రమణరావు, సెక్రటరీలు సుధాకర్, శ్రీనివాసరావు, శామ్యూల్‌ను అభినందించారు. సామాన్యులకు న్యాయ సేవల్ని అందుబాటులో ఉంచాలని పిలుపునిచ్చారు. జిల్లా కోర్టులో సదుపాయాల కల్పన విషయంలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని, అవసరమైన మేరకు తాను కూడా సహకరిస్తానన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణాన్ని అభివృద్ధి చేసుకోవడానికి అంతా కలిసి ముందుకు వెళ్దామని పిలుపునిచ్చారు.

## కోదండ రామాలయం ధ్వజస్తంభ నిర్మాణ మహోత్సవంలో పాల్గొన్న కాగిత....



**కృత్తివెన్ను ఏప్రిల్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)** కృత్తివెన్ను మండలం నిడమర్రు పంచాయతీ ఓర్లగొందితిప్ప గ్రామంలోని శ్రీ కోదండ రామాలయం ధ్వజస్తంభ నిర్మాణం మహోత్సవంలో, మరియు పరతడిక పంచాయతీ శ్రీ కోదండ రామాలయం పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన పెడన నియోజకవర్గ శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్. ఈ సందర్భంగా వేద పండితులు కాగిత కృష్ణ ప్రసాద్ తో ప్రత్యేక పూజలు నిర్వహించి వేద ఆశీర్వాదం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ ఒడుగు తులసిరావు టీడీపీ ప్రధాన కార్యదర్శి పిన్నింటి రత్తయ్య జిల్లా కార్యదర్శి కూనసాని చిన్నా, డీసీ వైస్ చైర్మన్ బొర్రా ఏడుకొండలు మాజీ నీటి సంఘం అధ్యక్షులు నడకుదుటి ఆంజనేయులు,బస్వాని బంగారు రాజు, మాజీ నీటి సంఘం అధ్యక్షులు దాసరి ఆదినారాయణ, చేకూరి వెంకట్రావు జనసేన మండల అధ్యక్షులు తిరుమని రామాంజనేయులు, సూరగని బ్రహ్మం, బలరాం స్వామి, మరియు కూటమి నాయకులు ప్రజలు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలను తిలకించి అనంతరం ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనలో పాల్గొని స్వామివారి కృపాకటాక్షాలకు పాత్రులైనారు..

## ఎస్ ఎస్ ఎస్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ ప్రారంభించిన డా. కొల్లూరి




**పెడన ,ఏప్రిల్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)**పట్టణ గూడూరు రోడ్డులో స్థానిక జడ్పీహెచ్ స్కూల్ ఎదురుగా ఫార్మసిస్ట్ నక్క శర్వాణి ఏర్పాటు చేసిన ఎస్ ఎస్ ఎస్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ నూతన వ్యాపారాన్ని పెడన హోల్సేల్ అండ్ రిటైల్ కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరవ డాక్టరేట్ అవార్డు గ్రహీత డా. కొల్లూరి చిన్న ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. కొల్లూరి మాట్లాడుతూ ఆర్య వైశ్యుల ఆరాధ్య దైవం శ్రీ వాసవి మాత ఆశీస్సులతో ఈరోజు నుండి ప్రారంభమైన ఎస్ ఎస్ ఎస్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ దిన దినాభివృద్ధి చెందాలని నాణ్యమైన మందులు అతి తక్కువ ధరలకు ప్రజలకు విక్రయిస్తూ అందరి మన్ననలు పొందాలన్నారు డా. కొల్లూరి. మీ వ్యాపార అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు డా. కొల్లూరి. మా ఆహ్వానాన్ని మన్నించి మేము ఏర్పాటు చేసిన ఎస్ ఎస్ ఎస్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్ నూతన వ్యాపారాన్ని ప్రారంభించిన డా. కొల్లూరి కి ఫార్మసిస్ట్ శర్వాణి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో చింతల వేణు ఇళ్ల ప్రభు తేజ గంజాల పండు శ్రీను ఉసిరిక వాసవి చందన శ్రీజ చైత్ర శ్రీ తదితరులు పాల్గొన్నారు.

## పదిలో భాష్యం విద్యార్థిని నేహాంజనికి స్టేట్ ఫస్ట్ ర్యాంక్




**కాకినాడ, ఏప్రిల్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)** కాకినాడలోని భాష్యం స్కూల్ పదో తరగతి విద్యార్థిని యాళ్ల నేహాంజనికి రాష్ట్రస్థాయిలో ఫస్ట్ ర్యాంక్లో ఉత్తీర్ణత సాధించింది. ఈ సందర్భంగా భాష్యం కాకినాడ శాంతినగర్ శాఖ ప్రిన్సిపల్ వల్లూరి గోవిందరాజు బుధవారం ఈ విషయాన్ని తన స్కూల్లో విలేకరులకు వివరించి సంబరాలు నిర్వహించారు. అలాగే సామర్లకోటకు చెందిన లక్ష్మీ సాయి హర్షిత 600 మార్కులు గాను 596, లక్ష్మీప్రసన్న 600కి 595, మహి శ్రీ వైష్ణవి 600కి 592, డి భువన 600కి 592, బీడీ ప్రసన్న 600కి 592, రాకేష్ 600కి 591 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఇంకా అనేకమంది విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించడం పట్ల గోవిందరాజు హర్షం వ్యక్తం చేశారు. తాను ఐటిఐలో చేరి ఐఏఎస్ సాధించటమే లక్ష్యంగా చదువుతానని స్నేహాంజని మీడియాకు తెలిపింది. అనంతరం ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలిచ్చి అభినందించారు. ఇంతటి ఉత్తీర్ణ సాధించిన పట్ల ఉపాధ్యాయులను, సిబ్బందిని గోవిందరాజు అభినందించారు.

## శ్రీ సిద్ధార్థ పదవ తరగతి విద్యార్థుల విజయ దుందుభి




**విస్సన్నపేట ఏప్రిల్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)**స్థానిక మండలంలో శ్రీ సిద్ధార్థ విద్యాసంస్థలు పదవ తరగతి పరీక్ష ఫలితాలలో విజయ దుందిబి మ్రోగించినట్లు సంస్థ అధినేత మేడా మోహనరావు మీడియా సమావేశంలో తెలియజేశారు. కొరివి డింపుల్ అశ్లేష 584, జక్కుల హర్షిత్ 582, పిబిఎన్ సాయిరాం581, పొన్నూరు సాయి ప్రసన్న 577, కొండ వరద పూజిత 569, చన్నీళ్ళ సుమన శ్రీ 5 69 ప్రథమ శ్రేణి ర్యాంకులతోపాటు 500 మార్కులకు పైగా 49 మంది విద్యార్థిని విద్యార్థులు సాధించారని 92 శాతం పాస్ పర్సంటేజీ తో అగ్రగామిగా నిలిచిందన్నారు. సంస్థ డైరెక్టర్లు శ్రీ హర్ష ,దీప్తిలు ఉపాధ్యాయులను విద్యార్థులను అభినందించారు.

## టెన్త్ పరీక్షల్లో శ్రీ గౌతమ్ హై స్కూల్ విద్యార్థుల విజయ దుందుభి








**విజయవాడ పశ్చిమ, ఏప్రిల్ 23: (వార్తా ప్రభ ప్రతినిధి)**పదవ తరగతి పరీక్షల్లో విజయవాడ వన్ టౌన్ లోని శ్రీ గౌతమ్ విద్యాసంస్థల విద్యార్థులు విజయ దుందుభి మ్రోగించారని శ్రీ గౌతమ్ విద్యాసంస్థల అధినేత ఎన్ .సూర్యారావు తెలిపారు. బుధవారం ఆయన ఈ విషయాన్ని తెలియజేశారు. తమ విద్యా సంస్థలు అత్యుత్తమ ఫలితాలతో దూసుకుపోతున్నాయని ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ పదవ తరగతి పరీక్షల్లో ఈ . శరణ్య 591 మార్కులను సాధించి తన విద్యాసంస్థల్లో ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. అలాగే ఎస్. కీర్తి 587 మార్కులు, వి. ఈశ్వరి 580 మార్కులతో ద్వితీయ, తృతీయ స్థానాలను సాధించారని తెలిపారు. సబ్జెక్టులు వారీగా తెలుగులో నూటికి నూరు, హిందీలో నూటికి 99, ఇంగ్లీషులో నూటికి 98, గణితంలో నూటికి 98 ,సైన్స్ లో నూటికి 100, సోషల్ లో నూటికి 100 మార్కులను తమ విద్యార్థులు సాధించడం జరిగిందన్నారు. కాగా పదవ తరగతి పరీక్షల్లో అత్యున్నత మార్కులను సాధించిన విద్యార్థిని విద్యార్థులను అభినందిస్తూ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రిన్సిపల్ తులసి పర్యవేక్షించారు.

## అభివృద్ధిని అడ్డుకోవడం సరికాదు

**తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ నాయకులు గుర్రంకొండ**



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో పెట్టుబడులను తీసుకురావడానికి నిరంతరం కష్టపడుతుంటే వాటిని అడ్డుకోవటం వైసీపీ నాయకులకు భావ్యం కాదని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర బీసీ నాయకులు గుర్రం కొండ తీవ్రంగా ఖండించారు. విశాఖపట్నంలో అర్సా క్లస్టర్ కంపెనీకి ప్రభుత్వం భూమి కేటాయించడంపై మాజీ ఎంపీ కేసినేని నాని నిరాధారమైన ఆరోపణలు చేయడం సమంజసం కాదని, ఆ కంపెనీతో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) గారికి సంబంధం ఉందని ఆరోపణలు చేయడంపై గుర్రంకొండ ధ్వజమెత్తారు.ఇటువంటి ఆరోపణలతో రాష్ట్రంలో పెట్టుబడులను అడ్డుకోవాలనే ప్రయత్నం చేయడాన్ని మానుకోవాలని, ఎంపీ కేసినేని శివనాద్ (చిన్ని ) నిరంతరం అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు వెళుతున్నారని, అటువంటి చిన్ని గారి మీద ఆరోపణలు చేస్తే తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని గుర్రంకొండ తీవ్రంగా హెచ్చరించారు.

## ఎంపీ చిన్నిని విమర్శిస్తే సహించేది లేదు

**మాజీ ఎంపీ నాని ఆరోపణలపై టిడిపి నాయకులు మోహన్**



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 23:(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిపై అనవసరంగా ఆరోపణలు చేస్తే సహించేది లేదని మాజీ ఎంపీ కేశినేని నాని పై తెలుగుదేశం నాయకులు లింగంపల్లి మోహన్ రావు ధ్వజమెత్తారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన చేస్తూ కేశినేని నాని మాటలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉన్నాయని విమర్శించారు. ఎన్టీఆర్ జిల్లా ప్రజలు పార్టీ నాయకులు తిరస్కరించడంతో మీరు దొంగల పార్టీలోకి వెళ్లారనీ ,అక్కడ మీ పని ఏంటో మీ స్థాయి ఏంటో మీరేంతో ప్రజలకు తెలిసిందనీ విమర్శించారు. ప్రజలు మిమ్మల్ని అందనంత దూరానికి పంపించినా మీ పద్ధతి మీ ఆలోచన ధోరణి మారలేదన్నారు. మా నాయకుడు కేశినేని శివనాథ్ చిన్నిని విమర్శించే అర్హత మీకు లేదని పేర్కొన్నారు. మా ఎంపీ కేశినేని చిన్ని ఎన్టీఆర్ జిల్లా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజల కష్టాలు తీరుస్తున్నారని, అటువంటి నాయకుడిపై మీరు అర్థం లేని విమర్శలు చేస్తే సహించేది లేదని మోహన్ పేర్కొన్నారు. మా నాయకుడు చిన్ని మా అందరికీ ఎంతో అండ గా ఉన్నారని, ఎంతోమందికి ఉపాధి అవకాశాలు చూపిస్తున్న నాయకుడు కేశినేని చిన్ని అని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ఇప్పిస్తూ ఎంతోమంది యువతి యువకులను ప్రయోజకులను చేస్తున్న నాయకుడు మా ఎంపీ చిన్ని అని పేర్కొన్నారు. మీ మీద తిరుగుబాటు చేయటానికి కూడా ఎన్టీఆర్ జిల్లా ప్రజలు రెడీగా ఉన్నారని మోహన్ పేర్కొన్నారు.

# హోంగార్డ్ సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తాం

**- జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు**




**మచిలీపట్నం ఏప్రిల్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)**హోంగార్డ్స్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దర్బార్ కార్యక్రమం నిర్వహించిన జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర రావు. పోలీస్ శాఖలో అంతర్భాగంగా విధులు నిర్వర్తించే హోంగార్డ్స్ యొక్క సంక్షేమం కోసం ఎల్లవేళలా కృషి చేస్తామని బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో గల స్పందన సమావేశ మందిరంలో హోంగార్డ్స్ యొక్క సమస్యల పరిష్కారానికి నిర్వహించిన హోంగార్డ్స్ దర్బార్ లో జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు అన్నారు. జిల్లా వ్యాప్తంగా పనిచేస్తున్న హోంగార్డ్స్ సమస్యల పరిష్కారానికి నిర్వహించిన హోంగార్డ్స్ దర్బార్ కార్యక్రమం లో ఎస్పీ గారు హోమ్ గార్డ్స్ వద్ద నుండి వినతులను స్వీకరించి వాటిపై సానుకూలంగా స్పందించారు. ఈ సందర్భంగా ఎస్పీ గారు మాట్లాడుతూ మీ వృత్తిని గౌరవించి విధులు నిర్వహించండి. పనితనం ఉంటేనే గౌరవం పెరుగుతుంది. హోదాతో పని లేదు. మన అందరి యూనిఫాం ఒక్కటే క్రమ శిక్షణతో విధులు నిర్వర్తిస్తూ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలన్నారు. హోంగార్డుల సంక్షేమానికి ఎల్లవేళలా కృషి చేస్తానని, హోంగార్డులందరూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తిస్తూ జిల్లా పోలీస్ శాఖకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని, మీరు చేసేది హోంగార్డు ఉద్యోగం అయిన మీ వృత్తిని మీరు గౌరవించి విధులు నిర్వర్తించాలని, పోలీసు శాఖలో మంచి మెళుకువలు మరియు పనితనం ఉంటేనే గౌరవం పెరుగుతుందని దానికి హోదాతో పనిలేదని, మన హోదాలు వేరైనా మనందరి యూనిఫామ్ ఒకటేనని గుర్తు చేశారు. హోంగార్డ్స్ వృత్తి పరంగా ఆరోగ్యపరంగా వారికున్న సమస్యలు గురించి ఎస్పి కి విన్నవించుకోగా, వారి సమస్యలపై సానుకూలంగా స్పందించి తమ పరిధిలో ఉన్నవన్నీ ఖచ్చితంగా పరిష్కరిస్తామని, తమ పరిధికి మించి ఉన్న సమస్యలను ప్రభుత్వం మరియు అడిషనల్ డిజి (హోంగార్డ్స్) దృష్టికి తీసుకొని వెళతామని భరోసా కల్పించారు. అదేవిధంగా హోంగార్డులు ఎవరైనా ఇతర చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొన్నట్టు తన దృష్టికి వస్తే ఎంక్వయిరీ చేసి వెంటనే సర్వీస్ నుంచి తొలగించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డ్స్ కమాండెంట్ విజయవాడ రీజియన్ టి ఆనంద్ బాబు , అడిషనల్ ఎస్పీ అడ్మిన్ వి.వి. నాయుడు , అడిషనల్ ఎస్పీ ఏఆర్ బి.సత్యనారాయణ , ఏఆర్ డిఎస్పి వెంకటేశ్వరరావు , హోమ్ గార్డ్స్ డిఎస్పి విజయవాడ డివిజన్ ఎన్. వెంకటరమణ , హోంగార్డ్స్ ఆర్ ఐ రవికుమార్, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# పదిలో విజయ దుందుభి మ్రోగించిన లుంబిని విద్యాలయం

**● నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం కైవసం ● షేక్ ఆఫ్రిన్ తాజ్ 596 మార్కులుతో ప్రథమ స్థానం ● లుంబినిలో 592తో ద్వితీయ స్థానంలో ఉడతా అనూష**



**చేజర్ల ఏప్రిల్ 23 (వార్తాప్రభ)** 2024-2025వ సంవత్సరానికి గాను పదవ తరగతి ఫలితాలలో లుంబిని విద్యాలయం విజయ దుందుభి మ్రోగించింది. నియోజక వర్గ స్థాయిలో ప్రథమ స్థానం జిల్లా స్థాయిలో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్న ఏకైక విద్యాసంస్థగా లుంబిని విద్యాలయం ఆత్మకూరు నియోజకవర్గం లోని నిలవడం మాకు చాలా ఆనందంగా ఉందని పాఠశాల కరస్పాండెంట్ మేనేజ్మెంట్ మరియు ఉపాధ్యాయులు పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో నియోజకవర్గ స్థాయిలో మండల స్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించి లుంబిని విద్యాలయాన్ని ఉన్నత స్థాయిలో నిలిపిన విద్యార్థినీ విద్యార్థులందరికి ప్రత్యేక అభినందనలు తెలియజేసిన ఉపాధ్యాయ బృందం లుంబిని యాజమాన్యం తెలియజేశారుఈ సందర్భంగా మండల ప్రజలు నింబినీ విద్యాలయాన్ని ప్రశంసలతో ఉన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన చేజర్ల గ్రామానికి చెందిన షేక్ నాయబ్ కుమార్తె ఆఫ్రిన్ తాజ్ 600 మార్కులకు గాను 596 మార్కులు సాధించి మండల ప్రథమ స్థానంలో నిలిచింది.అలాగే లుంబిని విద్యాలయంలో చదివిన గొల్లపల్లి గ్రామానికి చెందిన ఉడత చిన్న హజరత్తయ్య కుమార్తె ఉడత అనూష 600 మార్కులకు 592 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది.మొత్తం 40 మంది 550 మార్కులకు పైగా అలాగే 500 పైన వచ్చిన వారు 70 మంది ఫలితాలు సాధించారని పాఠశాల కరెస్పాండెంట్ బి. రమేష్ పేర్కొన్నారు.

# శక్తి" యాప్ ఆవశ్యకత గురించి విస్తృతంగా అవగాహన కల్పిస్తున్న శక్తి టీం బృందాలు...



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మహిళలు మరియు బాలికల యొక్క రక్షణ కొరకు మహిళా చట్టాల ద్వారా కల్పించబడుతున్న చట్టాలను గురించి మహిళలకు, విధ్యార్ధినీ విధ్యార్ధులకు శక్తి యాప్, 112 (అత్యవసర సేవలు), 1930 (సైబర్ మోసాల నివేదికల కోసం), 1098 (బాలల హెల్ప్‌లైన్) వంటి కీలకమైన టోల్-ఫ్రీ నెంబర్ లపై విస్తృతంగా అవగాహన కల్పించడం ద్వారా ఆపద సమయాలలో ప్రజలకు మేము ఉన్నాం అనే భరోసా కల్పించాలనే సదుద్దేశంతో నగర పోలీసు కమిషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఆదేశాల మేరకు మహిళా పోలీస్ స్టేషన్ ఎ.సి.పి. శ్రీమతి కె.లతాకుమారి పర్యవేక్షణలో ప్రతి రోజూ ఎన్.టి.ఆర్.జిల్లా పోలీసు కమిషనరేట్ పరిదిలోని శక్తి టీం బృంధాలు నగరంలోని ఆయా ప్రాంతాల స్థానిక మహిళలకు మరియు కళాశాలలోని విధ్యార్ధినులకు మహిళల రక్షణ కవచం శక్తి యాప్ అని, ప్రతి ఒక్క మహిళ, గృహిణులు, విద్యార్థినిలు, బాలికలు మొబైల్లో శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకుని ఆపద సమయంలో పోలీస్ వారి తక్షణపు సహాయం పొందాలని , అవగాహన కల్పిస్తున్నారు. ఈ శక్తి బృంధాల వారు మొబైల్లో శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకునే విధానం, దాని ఉపయోగాలు, బాల్య వివాహాలు, బాల కార్మిక, వెట్టిచాకిరీ వ్యవస్థలు, మానవ అక్రమ రవాణా, ఫోక్సో యాక్ట్, మాదకద్రవ్యాల నిషేధం, డయల్ 112, 1098, 1930 మొదలగు అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు . శక్తి యాప్ కలిగి ఉంటే పోలీసు వారు వారి వెంటే ఉన్నట్లుగా ఉంటుందని ఏదైనా ఆపద సమయంలో సమాచారం అందించిన పది నిమిషాల వ్యవదిలో బాధితులకు పోలీసు వారు సహాయం అందించగలుగుతారని తెలియజేశారు.

# పుస్తకాలు విద్యార్థుల నేస్తాలు

**ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగాధిపతి వెంపటి శ్రీసాయి**







**విజయవాడ పశ్చిమ, ఏప్రిల్ 23:(వార్తా ప్రభ ప్రతినిధి)** విద్యార్థులకు నిజమైన నేస్తాలు పుస్తకాలేనని, పుస్తకాలు చదవటం వల్ల విజ్ఞానంతో పాటు అనేక అంతర్గత శక్తుల ఉద్దీపన కూడా జరుగుతుందని ఆకాశవాణి ప్రాంతీయ వార్తావిభాగాధిపతి వెంపటి శ్రీసాయి అన్నారు. కె.బి.ఎన్. కళాశాల తెలుగు, గ్రంథాలయ విభాగాల సంయుక్త నిర్వహణలో బుధవారం ప్రపంచ పుస్తక దినోత్సవం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీసాయి మాట్లాడుతూ పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందన్నారు. జీవితంలోని ప్రతి దశలో విద్యార్థులకు తోడుగా ఉంటూ, భావోద్వేగాలను నియంత్రిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ పుస్తక పఠనం జీవితాన్ని చక్కటి మలుపుతిప్పుతుందన్నారు. గ్రంథాలయాలకు వెళ్ళటం, పుస్తకాలు చదవటం విద్యార్థుల దైనందిన చర్యగా మారాలన్నారు. ప్రపంచ ప్రసిద్ధి పొందిన అబ్దుల్ కలామ్, నెల్సన్ మండేలా వంటి ప్రముఖులను పుస్తక పఠనమే తీర్చిదిద్దిందన్నారు. గ్రంథాలయ అధికారి శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఈ బుక్స్ వంటి సాంకేతిక ఆవిష్కరణలు ఎన్ని వచ్చినా అవి పుస్తకానికి ప్రత్యామ్నాయం కాలేవన్నారు. కళాశాల తెలుగు అధ్యాపకుడు, సాహితీవేత్త డాక్టర్ కప్పగంతు రామకృష్ణ రాసిన 'శ్రీభారతి' పుస్తకాన్ని ముఖ్యఅతిథి శ్రీసాయి ఆవిష్కరించారు. పుస్తకదినోత్సవం సందర్భంగా నిర్వహించిన 'పుస్తక సమీక్ష' పోటీల విజేతలకు అతిథులు బహుమతులు అందించారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ జి.నాగరాజు, అధ్యాపకులు డాక్టర్ పవన్ కుమార్ రెడ్డి, ఆర్.జితేంద్ర కుమార్ పాల్గొన్నారు.

## సిఐఐ తెలంగాణ శాఖ చైర్మన్ ను అభినందించిన ట్రాపసా



**కూకట్ పల్లి,ఏప్రిల్ 23(వార్తాప్రభ):**కాన్ఫడరేషన్ అఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) తెలంగాణ రాష్ట్ర శాఖ కు చైర్మన్ గా ఎన్నికైన రాచమల్లు ఫోర్జింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్. శివ ప్రసాద్ రెడ్డి ని ట్రాపసా సభ్యులు, గాంధీనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.బుధవారం రంగారెడ్డి నగర్ లో ని ఆయన కంపెనీ లో శివ ప్రసాద్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలసి సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శివ ప్రసాద్ రెడ్డి చేస్తున్న సేవలను కొనియాడారు. 40 సంత్సరాలు గా రక్షణ రంగం, అంతరిక్ష విడి బాగాలను తయారు చేసే పరిశ్రమను నడిపిస్తూనే సమాజానికి సేవ చేస్తున్నారని అన్నారు. జిల్లా పరిషత్ గాంధీ నగర్ పాఠశాల అభివృద్ధి లో కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. పాఠశాల లో విద్యా వాలంటీరలకు జీతాలు అందజేస్తున్న ఆయన గొప్ప వ్యక్తిత్వం గల వ్యక్తి అన్నారు. సామాజిక స్పృహ కలిగిన శివ ప్రసాద్ రెడ్డి సి ఐ ఐ కి చైర్మన్ కావడం హర్షనీయం అన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని ఉన్నత పదవులను పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు రమేశ్వర్ రెడ్డి, గాంధీనగర్ జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకట్ రాములు, యూటీఫ్ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు జయసింహ రెడ్డి, , ట్రాపసా కుత్బుల్లాపూర్ అధ్యక్షులు వినోద్ జాదవ్, చైర్మన్ కొల వెంకటేష్, కోశాధికారి శ్రీశైలం,టియుడబ్ల్యుజె మేడ్చెల్ జిల్లా అధ్యక్షులు గడ్డమీది బాలరాజు, వైష్ణవి గ్రూప్ అఫ్ స్కూల్స్ చైర్మన్ నరసింహులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పదో తరగతి ఫలితాలపై ఆదిత్య విద్యార్థులు తల్లిదండ్రులు హర్షాతిరేకం





**కాకినాడ ఏప్రిల్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)**పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విడుదలైన తరుణంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆదిత్య పాఠశాలలో సందడి వాతావరణం నెలకొంది.ఇంతటి ఘన విజయం సాధించడానికి తగిన తర్ఫీదు అందించిన ఉపాధ్యాయ సిబ్బందికి, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేసుకోవడానికి సంబంధిత పాఠశాలకు తల్లిదండ్రులు తమ పిల్లలతో కలిసి వచ్చారు. రికార్డు స్థాయిలో అత్యధికంగా 596 మార్కులు సాధించిన ఎవివి.సత్య సూర్యతేజ,బన్వాత్ మహిత్ నాయక్ తల్లిదండ్రుల ఆనందానికి అవధులు లేవు. విద్యార్థులు తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ పిల్లలు అత్యధిక మార్కులు, అత్యధిక ఉత్తీర్ణతా శాతం సాధించడం జరిగిందని అందుకు ఆదిత్య ప్రత్యేక ప్రణాళిక ఎంతగానో తోడ్పడిందన్నారు. ఈ సందర్భంగా ఆదిత్య విద్య సంస్థ డైరెక్టర్ నల్లమిల్లి శృతి రెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాలలో చదువుతున్న 53 మంది విద్యార్థులు 590 పైగా మార్కులు సాధించారన్నారు. అలాగే 465 మంది విద్యార్థులు 550 పైగా మార్కులు పొందారని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయుల కృషి ఫలితంగానే అత్యుత్తమ ఫలితాలు సాధించడం సాధ్యమైంది అని అన్నారు.ఈ సందర్భంగా భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని వారి ఆశయం నెరవేరాలని అభిలషిస్తూ విద్యార్థులను ఆదిత్య విద్యాసంస్థల వ్యవస్థకు చైర్మన్ డాక్టర్ నల్లమల్లి శేషారెడ్డి అభినందించారు.

## 48వ డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి

**టిడిపి 48 వ డివిజన్ అధ్యక్షులు పేరాబత్తుల రమణకు ఎమ్ ఎస్ బేగ్ హామీ**



**విజయవాడ పశ్చిమ, ఏప్రిల్ 23:(వార్తా ప్రభ ప్రతినిధి)** స్థానిక 48వ డివిజన్ ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలుగుదేశం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎం ఎస్. బేగ్ చెప్పారు. బుధవారం చిట్టినగర్ సెంటర్లోని పేరా బత్తుల రమణ కార్యాలయానికి విచ్చేసిన టిడిపి రాష్ట్ర నాయకులు బేగ్ నకు రమణ ,స్థానిక తెలుగుదేశం నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బేగ్ నకు రమణ డివిజన్లోని కొన్ని ప్రజా సమస్యలను, తెలుగుదేశం పార్టీ విషయాలను వివరించడం జరిగింది. తెలుగుదేశం కార్యకర్తల అభివృద్ధికి సహకరించాలని బేగ్ ను కోరారు. ఈ సందర్భంగా బేగ్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబు రాష్ట్ర అభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నారని చెప్పారు. త్వరలోనే పశ్చిమ నియోజకవర్గంలోని దేవాలయాలు, వివిధ ట్రస్టులకు సంబంధించిన పదవులను కూటమి నాయకులకు, కార్యకర్తలకు పశ్చిమ శాసనసభ్యులు వై. సుజనా చౌదరి కేటాయించనున్నట్లు తెలిపారు. కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని చెప్పారు. కార్యకర్తల సంక్షేమం తెలుగుదేశం పార్టీ లక్ష్యమని చెప్పారు. ఈ సందర్భంగా బేగ్ ను రమణ శాలువాతో సత్కరించబోగా ఆయన ప్రజా సమస్యలపై పనిచేస్తున్న మిమ్మల్ని సత్కరించడం అవసరమని రమణను శాలువతో సత్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లింగంపల్లి మోహన్ రావు, స్థానిక 48వ డివిజన్ నాయకులు ఉప్పుడి రాము, ఎస్.కె నాగూర్, అక్బర్, పొన్నాడ రాము, సలీం, ముచ్చిపల్లి శ్రీను, రాయన రాజా, పేరాబత్తుల వీరకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## పదోతరగతి పరీక్షల్లో ప్రతిభను చాటిన విద్యార్థిని అభినందించిన ఎమ్మెల్యే సుజనా చౌదరి



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పది (10)వ తరగతి ఫలితాలలో, పశ్చిమ నియోజకవర్గానికి చెందిన విద్యార్థిని షేక్ జెహారాభి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు, భవానిపురం లోని ఎస్.ఎం.ఎ ఖుద్దుస్ మున్సిపల్ పాఠశాలలకు చెందిన జెహరాభి ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా 574 మెరుగైన మార్కులు సాధించగా ఉత్తీర్ణత శాతం లో ఆ పాఠశాల తృతీయ స్థానంలో నిలిచింది.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి విద్యార్థిని జెహరాభి కి ఎక్స్ ఖాతాలో అభినందనలు తెలిపి ప్రశంసించారు. సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గం లోని ప్రభుత్వ పాఠశాలల మౌలిక వసతులను మెరుగుపరుస్తూ విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి ప్రత్యేకమైన శ్రద్ధ వహిస్తున్నారు.బాలిక మెరుగైన ఫలితాల పట్ల ఎమ్మెల్యే సుజనా సంతోషం వ్యక్తం చేశారు.

## శ్రీవిద్యాంజలి విద్యార్థులు ఎస్ ఎస్ సి-2025ఫలితాలలో విజయకేతనం




**విజయవాడ పశ్చిమఏప్రిల్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పదవ తరగతి ఫలితాలలో 100% ఉత్తీర్ణతసాధించినట్లు,స్కూల్ టాపర్ గా టి నందిని 558మార్కులు సాధించగా ఎస్ ఎస్ సిపబ్లిక్ పరీక్షలకు హాజరైన విద్యార్థులందరు 100% ఉత్తీ ర్ణత సాధించినట్లు స్కూల్ డైరెక్టర్ పుప్పాల శ్రీనివాసరావు బుధవారం తెలియజేసారు.పాసైనా విద్యార్థులకు స్వీట్స్ తినిపించి, విద్యార్థులు, స్కూల్ సిబ్బంది బాణా సంచా కాల్చి ఈ విజయోత్సవాన్ని నిర్వహించారు.కాగా తమపై ఎంతో నమ్మకం ఉంచిన తల్లిదండ్రులు నమ్మకాన్ని వమ్ము చేయకుండా మంచి ఫలితాలు సాధించిన విద్యార్థులకు,అలాగే వారికి విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులకు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188